

రైల్వే జోన్‌పై తాత్సారం!

ముడసర్లోవలో భూములు కేటాయించినా ప్రారంభంకాని పనులు

- అవి వాటర్ బాడీస్ అంటూ వంక
- 'వాటర్ వర్క్స్'కు చెందిన భూములే తప్ప వాటర్ బాడీస్ కాదని స్పష్టత ఇచ్చిన జీవీఎంసీ
- అక్కడ జోనల్ కార్యాలయం నిర్మాణానికి అంగీకారం తెలిపిన రైల్వే అధికారులు
- ఈలోగా ఐఐఎం, గిరిజన విశ్వవిద్యాలయాల్లా మరోచోట కార్యకలాపాలు ప్రారంభించలేరా?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ కేంద్రంగా 'దక్షిణ కోస్తా రైల్వే జోన్' ప్రకటించి మూడేళ్ల దాటిపోయింది. సరైన భూమి ఇవ్వలేదని వంకలు పెడుతూ కేంద్రం పనులు ప్రారంభించడం లేదు. జీవీఎంసీ ముడసర్లోవలో 52 ఎకరాల భూమిని చాలాకాలం క్రితమే కేటాయించింది. అందులో ఆక్రమణదారులు ఉన్నారని, వారు రానివ్వడం లేదని రైల్వే అధికారులు చెబితే...జీవీఎంసీ అధికారులు వారిని ఖాళీ చేయించారు. ఆ తరువాత ఆ భూములన్నీ నిర్మాణానికి అనుకూలంగా లేవని, అందులో సగం వాటర్ క్యాచ్‌మెంట్ ఏరియా పరిధిలో ఉన్నాయని, ఆటువంటి చోట నిర్మాణాలు చేపట్టలేమని, ప్రత్యామ్నాయ భూములు ఇవ్వాలని రైల్వే అధికారులు కోరారు. అయితే జీవీఎంసీ అధికారులు దీనిపై పూర్తి స్పష్టత ఇచ్చినట్టు తెలిసింది. ముడసర్లోవలో రైల్వేకు కేటాయించిన భూముల్లో 90 శాతం నిర్మాణానికి అనుకూలమైనవని వివరించినట్టు సమాచారం. అవి జీవీఎంసీ 'వాటర్ వర్క్స్'కు చెందిన భూములే తప్ప వాటర్ బాడీస్ కాదని స్పష్టంచేసినట్టు ఓ ఉన్నతాధికారి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. దాంతో రైల్వే అధికారులు ఆ భూములు తీసుకోవడానికి అంగీకరించినట్టు, అక్కడే రైల్వే జోన్ కార్యాలయం నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్టు ప్రచారం జరుగుతోంది.



అరిలోవలో రైల్వే జోన్‌కు కేటాయించాల్సిన స్థలం


నాన్చుడు ధోరణి

తూర్పు కోస్తా జోన్ నుంచి వాల్తేరు డివిజన్‌ను, విశాఖపట్నాన్ని విడదీయడం భువనేశ్వర్‌లోని రైల్వే ఉన్నతాధికారులకు ఇష్టం లేదు. దానివల్ల ఆదాయం తగ్గిపోతుందనేది వారి ఆలోచన. రైల్వే శాఖ మంత్రి కూడా ఒడిశాకు చెందినవారే కావడంతో అక్కడి అధికారులకు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర విభజన హామీలలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం), కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం కేటాయించారు. విశాఖపట్నంలో ఐఐఎం, విజయనగరంలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుచేశారు. వీటికి కూడా వందల ఎకరాల భూములు కేటాయించారు. వాటిలో నిర్మాణాలు చేపట్టి, అవి పూర్తయ్యాక కార్యకలాపాలు ప్రారంభించాలంటే ఆలస్యం అవుతుందని ముందుగా అద్దెకు అవసరమైన భవనాలు తీసుకొని వాటిలో తరగతుల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఐఐఎంను 2015లోనే ఏయూలో ఏర్పాటు చేసి 2022లో గంభీరంలో నిర్మించిన క్యాంపస్‌లోకి తరలించారు. అంటే దాదాపుగా ఏడేళ్లు అద్దె భవనంలో తరగతులు నిర్వహించారు. ఇక గిరిజన విశ్వవిద్యాలయాన్ని తీసుకుంటే దానికి కూడా 500కు పైగా ఎకరాలు కేటాయించారు. ముందు రెల్లిలో ఆ తరువాత మెంటాడలో ... మిగతా 6వ పేజీలో

కష్టాల్లో ఉక్కు

తీవ్రమైన ముడి పదార్థాల కొరత

- నేటి నుంచి బ్లాస్ట్ ఫర్నేస్-3 మూసివేత
- ఇకపై ఒక్క బ్లాస్ట్ ఫర్నేస్‌తోనే ఉత్పత్తి
- నెలకు ఆదాయం రూ.వెయ్యి కోట్లకు మించని పరిస్థితి
- ప్లాంటు నిర్వహణ, ఉద్యోగులకు జీతాలు ఎలా ఇస్తారో...



విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):

విశాఖ ఉక్కు ఉద్యోగులకు యాజమాన్యం బుధవారం మరో షాక్ ఇచ్చింది. ముడి పదార్థాల కొరత కారణంగా ముఖ్యంగా కోకింగ్ కోల్ లేనందు వల్ల బ్లాస్ట్ ఫర్నేస్ (బీఎఫ్)-3ను గురువారం నుంచి మూసివేస్తున్నట్టు ప్రకటించింది.

ప్లాంటులో మొత్తం మూడు బ్లాస్ట్ ఫర్నేస్ (బీఎఫ్)లు ఉండగా ముడి పదార్థాలు అందుబాటులో లేకపోవడంతో బీఎఫ్-1ని కొద్దికాలంగా నడపడం లేదు. బీఎఫ్-2, బీఎఫ్-3లను అరకొరగా నడుపుతూ వచ్చారు. రెండింటి ద్వారా రోజుకు 14 వేల టన్నులకు పైగా హాట్ మెటల్ ఉత్పత్తి చేయాల్సి ఉండగా...పది వేల టన్నులు తీయడమే గగనంగా మారింది. ముఖ్యంగా విదేశాల నుంచి నౌకల ద్వారా తెప్పించుకున్న బొగ్గు గంగవరం, విశాఖపట్నం పోర్టుల్లో ఇరుక్కుపోయింది. షిప్పింగ్ ఏజెంట్లకు రవాణా చార్జీలు చెల్లించకపోవడంతో వారు కోర్టు అటాచ్‌మెంట్లు తెచ్చారు. దాంతో పోర్టుల నుంచి బొగ్గు ప్లాంటుకు చేరడం లేదు. కొంతమేర ప్రయత్నాలు చేసినప్పటికీ రెండు బీఎఫ్‌లను పూర్తి సామర్థ్యంతో నడిపేందుకు సరిపడా బొగ్గు లేదు. బొగ్గుతో కోక్‌ను తయారుచేసే ఓవెన్ బ్యాటరీలను అరకొరగా నడిపితే వాటిలో సాంకేతిక లోపాలు తలెత్తి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉండడంతో యాజమాన్యం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. కోక్ ఓవెన్ బ్యాటరీలకు నష్టం జరిగితే వాటి మరమ్మతులు చేయడానికి వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయి. అలాంటిదేమైనా జరిగితే మూలిగే నక్కపై తాటిపండు పడినట్టు అవుతుందని ఓవెన్ బ్యాటరీలు షట్‌డౌన్ చేసి, బీఎఫ్-3ను తాత్కాలికంగా మూసేయాలని నిర్ణయించారు. అంటే కేవలం ఒకే ఒక్క బీఎఫ్‌ను నడపనున్నారు. దీనిని కూడా పూర్తిస్థాయిలో నడిపితే రోజుకు ఏడు వేల టన్నులకు మించి ఉత్పత్తి రాదు. నెలకు రెండు లక్షల టన్నులు మాత్రమే వస్తుంది. నెలకు రూ.2,500 కోట్ల ఉక్కు అమ్మకాలు జరిపితేనే అన్ని ఖర్చులు పోను ఉద్యోగులకు జీతాలు ఇచ్చే అవకాశం ఉంటుంది. కేవలం రెండు బీఎఫ్‌లను అరకొరగా నడుపుతుండడం వల్ల ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేక, ముడి పదార్థాల కొనుగోళ్లకు డబ్బులు లేక ప్లాంటు ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. ఇప్పుడు నెలకు వచ్చే రెండు లక్షల టన్నులు ఉక్కును విక్రయిస్తే వేయి కోట్ల రూపాయల కంటే ఎక్కువ రావు. ఆ మొత్తంతో ప్లాంటును ఎలా నడుపుతారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ముడి పదార్థాల ఖర్చు కొంత తగ్గినా నిర్వహణ వ్యయాలన్నీ భరించాల్సిందే.

ఢిల్లీలో ఏం నిర్ణయించారో?

విశాఖ ఉక్కుకు ఎలా సాయం చేయాలనే అంశంపై ఢిల్లీలో ఉక్కు మంత్రిత్వ శాఖ మంత్రి, ఉన్నాతాధికారులు బుధవారం భేటీ అయ్యారు. సెయిల్‌లో విలీనం చేయడం ద్వారా అన్ని సమస్యలు అధిగమించవచ్చునని ఇక్కడి ఉద్యోగ వర్గాలు తెలియజేశాయి. అయితే దానిపై సానుకూల నిర్ణయం తీసుకోలేదని సమాచారం. కంటి తుడుపుగా ఎంతో కొంత మొత్తం ఇవ్వాలని, దాంతోనే ప్లాంటును ముందుకు తీసుకువెళ్లాలని నిర్ణయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. పూర్తి వివరాలు గురువారానికి కానీ తెలియవని ఉద్యోగ వర్గాలు తెలిపాయి. ఏదేమైనా రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా ఒత్తిడి చేస్తే తప్ప కేంద్రం సానుకూలంగా నిర్ణయం తీసుకోదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

జల వనరుల శాఖకు రూ.44.05 కోట్లు నష్టం

అత్యవసర పనులకు రూ.3.12 కోట్లు అవసరం

అధికారుల ప్రతిపాదనలు

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):

తీవ్ర వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఉమ్మడి జిల్లాలో జల వనరుల శాఖకు చెందిన పలు నిర్మాణాలు దెబ్బతిన్నాయి. భారీ, మధ్య, చిన్నతరహా ప్రాజెక్టులు, చెరువులకు రూ.44.05 కోట్లు నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. గండ్లు పూడ్చడం, ఇతరత్రా మరమ్మతులు మొత్తం 136 పనులు చేపట్టాలని గుర్తించారు. ఇందులో అత్యవసరమైనవి చేపట్టేందుకు రూ.3.12 కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఇంకా శాశ్వత ప్రాతిపదికగా పనులు చేపట్టడానికి మరో రూ.40.92 కోట్లు అవసరమని ప్రతిపాదనల్లో పొందుపరిచారు.

విశాఖ జిల్లాలో చిన్న నీటి పారుదల విభాగంలో 18 పనులకు సంబంధించి రూ.3.96 కోట్ల నష్టం వాటిల్లింది. దెబ్బతిన్న పనుల మరమ్మతులకు తాత్కాలికంగా రూ.25.55 లక్షలు, శాశ్వత పనులకు రూ.3.71 కోట్లు అవసరమని అంచనా వేశారు. భారీ నీటి పారుదల విభాగంలో రూ.2.02 కోట్ల నష్టం వాటిల్లగా తాత్కాలిక మరమ్మతులకు రూ.2.5 లక్షలు, శాశ్వత పనులు కింద రూ.2 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. అనకాపల్లి జిల్లాలో మైనర్ ఇరిగేషన్ విభాగంలో నర్సీపట్నం డివిజన్ పరిధిలో రూ.26.04 కోట్లు, చోడవరం వాటర్ షెడ్ డివిజన్‌లో రూ.9.37 కోట్లు నష్టం వాటిల్లింది. నర్సీపట్నం డివిజన్‌లో అత్యవసర పనులకు రూ.2.14 కోట్లు, శాశ్వత పనులకు రూ.23.9 కోట్లు..మొత్తం రూ.26.04 కోట్లు, చోడవరం డివిజన్‌లో అత్యవసర పనులకు రూ.0.40 కోట్లు, శాశ్వత పనులకు రూ.8.97 కోట్లు వెరసి రూ.9.37 కోట్లు కావాలని ప్రతిపాదించారు. మేజర్ ఇరిగేషన్ కింద తాండవ ప్రాజెక్టుకు అత్యవసరంగా రూ.1.8 లక్షలు, శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు రూ.1.08 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అలాగే మధ్య తరహా నీటి పారుదల విభాగం పరిధిలో చోడవరం ప్రాంతంలోని రైవాడ, కోనాం, పెద్దేరు రిజర్వాయర్లకు అత్యవసర పనులకు రూ.28.6 లక్షలు, శాశ్వత ప్రాతిపదికగా పనులు చేపట్టేందుకు ... మిగతా 6వ పేజీలో

ఇసుక నిల్

రెండు డిపోలూ ఖాళీ

- అగనంపూడిలో బుకింగ్స్ నిలిపివేత
- జిల్లా అవసరాల కోసం శ్రీకాకుళం జిల్లాలో రెండు రీచ్‌లు గుర్తింపు
- వరదలు రావడంతో ప్రస్తుతం తవ్వకాలకు అనుకూలించని వాతావరణం
- గోదావరి నుంచి తీసుకురావడం కష్టమే
- నిర్మాణదారులకు మొదలు కానున్న కష్టాలు



భీమిలిలో ఖాళీగా ఇసుక డిపో

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ప్రస్తుతం ఇసుక లేదు. రెండు డిపోల్లో గల ఇసుక మొత్తం అయిపోయింది. భీమిలి డిపో రెండు వారాల క్రితమే ఖాళీ కాగా, అగనంపూడిలో మంగళవారం నుంచి బుకింగ్ ఆపేశారు. దీంతో జిల్లా పరిధిలో అధికారికంగా ఇసుక నిల్వలు లేనట్టేనని అధికారులు స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో నగరంలో ఇళ్ల నిర్మాణదారులకు అవసరమైన ఇసుక దొరికే పరిస్థితి లేదు.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం గుర్తించిన ఇసుక రీచ్‌లు లేకపోవడంతో పొరుగునున్న శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాలపై ఆధారపడాల్సి వస్తోంది. గత ప్రభుత్వం ఇసుక అమ్మకాలకు డిపోలు ఏర్పాటుచేసిన తరువాత ధర పెరగడం, తరువాత కొన్నాళ్లు కృత్రిమ కొరత ఏర్పడడం వంటి ఇబ్బందులు వచ్చాయి. గత పాలకుల హయాంలో ఇసుక అమ్మకాలు చేపట్టిన ఇన్‌ఫ్రా కంపెనీ జిల్లాలో భీమిలి, అగనంపూడి డిపోల్లో రెండు లక్షల టన్నులు ఇసుక నిల్వ చేసింది. హౌసింగ్ నిర్మాణాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలో పలు విభాగాల్లో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు పంపిణీ చేసింది. ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే ఇన్‌ఫ్రా కంపెనీ ఇసుక అమ్మకాల నుంచి తప్పుకుంది. దీంతో డిపోల్లో కొంత ఇసుకను స్థానికంగా ఉండే రెవెన్యూ సిబ్బంది సాయంతో కొందరు వాహన యజమానులు తరలించుకుపోయారు. ఈ ఏడాది జూలై ఎనిమిదో తేదీ నుంచి జిల్లా కలెక్టర్ నేతృత్వంలో గనులు, రెవెన్యూ శాఖ అధికారులు భీమిలి, అగనంపూడి డిపోల్లో ఇసుక అమ్మకాలు ప్రారంభించారు. భీమిలి డిపోలో నిల్వలు 40 రోజులకు అయిపోయాయి. దాంతో అందరికీ అగనంపూడి డిపోయే ఆధారమైంది. రోజుకు 1,000 నుంచి 1,500 టన్నుల వరకూ అమ్మకాలు జరిగాయి. అక్కడ కూడా దాదాపు అయిపోవడంతో మంగళవారం నుంచి బుకింగ్స్ నిలిపివేశారు. ఇదిలావుండగా నగర అవసరాలకు శ్రీకాకుళం జిల్లా వంశధార నదిలో రెండు రీచ్‌లను గుర్తించారు. నదీ ప్రవాహ దిశ మారే క్రమంలో ఏర్పడిన ఇసుక మేటలు తవ్వకాలకు అనువుగా ఉంటాయని గనుల శాఖ గుర్తించింది. అయితే తాజా వర్షాలతో వంశధారకు వరద పెరిగింది. నదిలో వరద ప్రవాహం తగ్గుముఖం పట్టిన తరువాత గుర్తించిన రెండు రీచ్‌ల వద్ద తవ్వకాలకు వీలుపడుతుందా?, లేదా?...అనేది చూడాలని అధికారులు అంటున్నారు. ఇందుకు మరో వారం, పది రోజులు సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. గోదావరి నుంచి ఇసుక తీసుకువద్దామంటే ప్రమాదకర స్థాయిలో ప్రవాహం ఉంది. రెండు నదుల్లో ప్రవాహాలు తగ్గుముఖం పట్టిన తరువాతే ఇసుక తవ్వకాలకు వీలుపడుతుందని అంటున్నారు. అప్పటివరకూ నగరంలో నిర్మాణదారులకు ఇసుక లభించే పరిస్థితి లేదు. పోనీ ఒడిశా నుంచి ఇసుక తీసుకువద్దామన్నా అక్కడ కూడా భారీవర్షాలతో నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో తూర్పుగోదావరి, శ్రీకాకుళం జిల్లాల్లోని నదీ తీర ప్రాంతాల్లో గల తోటలు, పొలాల్లో అనధికారికంగా ఉన్న ఇసుక నిల్వలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బహిరంగ మార్కెట్‌లో విక్రయించడం ఒక్కటే మార్గమని అధికారులు అంటున్నారు.

'సాయిరాం పార్లర్' యజమాని సత్యనారాయణ హఠాన్మరణం



సత్యనారాయణ (ఫైల్ ఫొటో)

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 11:

ప్రముఖ హోటల్ వ్యాపారి తాళ్లూరి సత్యనారాయణ (59) (సాయిరాం పార్లర్ సత్యనారాయణ) అనారోగ్యంతో మంగళవారం అర్ధరాత్రి కన్ను మూశారు. మూడు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్యనారాయణ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతి నగరంలోని హోటల్ పరిశ్రమకు తీరని లోటని, ఆప్తుడ్ని కోల్పోయామని అసోసియేషన్ ప్రతినిధులు విచారం వ్యక్తంచేశారు. బుధవారం మధ్యాహ్నం సత్యనారాయణ అంత్యక్రియలు పూర్తి చేసినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

తిరుపతి, శ్రీకాకుళం రోడ్డు ప్రత్యేక రైళ్లు రద్దు

విశాఖపట్నం, సెప్టెంబరు 11:

నిర్వహణ కారణాల దృష్ట్యా తిరుపతి-శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ల మధ్య నడిచే ప్రత్యేక రైళ్లను రద్దు చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. తిరుపతి-శ్రీకాకుళం రోడ్డు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (07440) అక్టోబరు 6 నుంచి డిసెంబరు ఒకటి వరకు, తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం రోడ్డు-తిరుపతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (07441) అక్టోబరు ఏడు నుంచి డిసెంబరు రెండు వరకు రద్దు చేశామని పేర్కొన్నారు.

13న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల 13న నిర్వహించనున్నట్టు కార్యదర్శి ఎంవీడీ ఫణిరాం తెలిపారు. ఈనెల నాలుగో తేదీన స్టాండింగ్ కమిటీ సమావేశం జరగాల్సి ఉంది. అయితే కమిషనర్ పి.సంపత్‌కుమార్‌తోపాటు పలువురు అధికారులు వరద సహాయక చర్యల్లో పాల్గొనేందుకు విజయవాడ వెళ్లడంతో సమావేశం వాయిదాపడింది. నాటి సమావేశం కోసం ఇప్పటికే 280 అంశాలతో ఎజెండా తయారుచేసి సభ్యులకు పంపిణీ చేశారు. అదే ఎజెండాతో శుక్రవారం స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్టు ఫణిరాం తెలిపారు.

వీళ్లు పోరు!, వాళ్లు రారు!!

జీవీఎంసీలో జోనల్ కమిషనర్ల బదిలీపై అయోమయం

- గత నెల 30న బదిలీ అయినా ఇప్పటివరకూ రిలీవ్ కాని వైనం
- ఇంకా రిపోర్టు చేయని కొత్త జెడ్సీలు
- బదిలీ ఉత్తర్వులు సవరించే అవకాశం ఉందని ప్రచారం



విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):

గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)లో కొద్దిరోజుల కిందట జరిగిన బదిలీలపై అయోమయం నెలకొంది. జీవీఎంసీ పరిధిలో ఎనిమిది జోన్లు ఉండగా ఆరు జోన్‌లకు కమిషనర్‌లుగా పనిచేస్తున్న వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసి, వారి స్థానంలో కొత్తవారిని నియమిస్తూ గత నెల 30న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అయితే జోనల్ కమిషనర్లుగా నియమితులైన వారెవరూ ఇంతవరకూ జీవీఎంసీలో రిపోర్టు చేయకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కొత్తగా జోనల్ కమిషనర్లుగా నియమితులైన వారి పట్ల ఆయా జోన్‌ల పరిధిలోని ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేస్తుండడంతోనే ఇంకా విధుల్లో చేరలేదనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు బదిలీ అయిన ఆరుగురిలో ఒకరు మినహా మిగిలిన ఐదుగురు ఇంకా రిలీవ్ కాకుండా కొనసాగుతుండడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జోన్-1 కమిషనర్‌గా పనిచేస్తున్న కె.కనకమహాలక్ష్మిని సీఆర్‌డీఏ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశిస్తూ, ఆమె స్థానంలో సాలూరు మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న పి.ప్రేమప్రసన్నవాణిని నియమించారు. అలాగే జోన్-2 కమిషనర్‌గా పనిచేస్తున్న జి.శైలజావల్లిని రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యదర్శిగా బదిలీ చేస్తూ...ఆమె స్థానంలో పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న పి.సింహాచలాన్ని నియమించారు. జోన్-3 కమిషనర్‌గా పనిచేస్తున్న విజయలక్ష్మిని ఆమె మాతృసంస్థకు సరండర్ చేస్తూ ఆమె స్థానంలో శివప్రసాద్‌ను నియమించారు. జోన్-4 కమిషనర్‌గా పనిచేస్తున్న పీవీడీ ప్రసాదరావును శ్రీకాకుళం మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఆయన స్థానంలో పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న ఎం.మల్లయ్యనాయుడును నియమించారు. ప్రసాదరావు విధుల నుంచి రిలీవ్ అయి శ్రీకాకుళం మునిసిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కానీ ఆయన స్థానంలో పోస్టింగ్ దక్కించుకున్న మల్లయ్యనాయుడు మాత్రం బాధ్యతలు స్వీకరించలేదు. జోన్-5 కమిషనర్‌గా పనిచేస్తున్న పి.కృష్ణను బదిలీ చేస్తూ ఆయన స్థానంలో రామును నియమించారు. జోన్-6 కమిషనర్‌గా పనిచేస్తున్న బి.సన్యాసినాయుడును ఆయన మాతృసంస్థకు సరండర్ చేస్తూ, ఆయన స్థానంలో రేపల్లె కమిషనర్‌గా పనిచేస్తున్న బీఆర్ఎస్ శేషాద్రిని నియమించారు. బదిలీ ఉత్తర్వులు జారీ చేసి 15 రోజులు కావస్తున్నా ఇంతవరకూ పాతవారు విధుల నుంచి రిలీవ్ కాలేదు. కొత్తవారు విధుల్లో చేరలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులను సవరించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

పంచ గ్రామాల భూ సమస్యకు పరిష్కారం?

దేవస్థానానికి సుమారు 426 ఎకరాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం

- ములగాడ, ఆనందపురం మండలాల్లో భూములు పరిశీలన
- ఎన్నికల హామీ నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు



స్థల పరిశీలన చేస్తున్న ఈఓ, అధికారులు

సింహాచలం, సెప్టెంబరు 11:

వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంతో ముడిపడిన పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పంచ గ్రామాల్లో అన్యాక్రాంతమైన భూములకు ప్రత్యామ్నాయంగా సింహాచలం దేవస్థానానికి సుమారు 426 ఎకరాల బదలాయింపునకు చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ బుధవారం ఆనందపురం మండలంతో పాటు గాజువాక సమీపాన గల ములగాడలోని సర్వే నంబరు 35లో భూములను పరిశీలించింది. త్రిసభ్య కమిటీలో దేవస్థానం ఈఓ, రెవెన్యూకు చెందిన ఆర్‌జేసీ కూడా ఉన్నారు. దేవస్థానం భూముల్లో గల 12,149 ఆక్రమణలను క్రమబద్ధీకరించేందుకు, అందుకు ప్రత్యామ్నాయంగా సుమారు 426 ఎకరాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో తొలుత దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ ఈనెల ఒకటో తేదీన సింహాచలం దేవస్థానం ఈఓతో కలిసి ప్రత్యామ్నాయంగా రెవెన్యూ అధికారులు ప్రతిపాదించిన ములగాడ భూములను పరిశీలించినట్టు తెలుస్తోంది. బుధవారం మరోమారు భూములు పరిశీలించిన బృందం త్వరలో జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నది. ఇదిలావుండగా పంచగ్రామాల భూ సమస్య పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు/అభ్యర్థులు హామీ ఇచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల ప్రకారం అధికారులు ముందుకువెళుతున్నారు.

కనక మహాలక్ష్మి ఆలయానికి రూ.25.37 లక్షల ఆదాయం



అమ్మవారి హుండీ ఆదాయం లెక్కిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది, పర్యవేక్షిస్తున్న అధికారులు

జగదాంబ కూడలి, సెప్టెంబరు 11: వన్‌టౌన్ కనకమహాలక్ష్మి అమ్మవారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఆగస్టు 3 నుంచి ఈనెల 11 వరకు 40 రోజులకు హుండీ ఆదాయం రూ.25,37,268 వచ్చినట్లు ఈవో శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. అదేవిధంగా అమ్మవారికి బంగారం 115-100 మిల్లీగ్రాములు, వెండి 742 గ్రాములు, విదేశీ కరెన్సీ వచ్చినట్లు తెలిపారు. కానుకల లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారులు కె.నీలిమ, జేఈవో వి.రాంబాబు, కె.తిరుమలేశ్వరరావు, శ్రీహరి సేవ భక్తులు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, యూనియన్ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

'అడ్డదారి పదోన్నతులు అంగీకరించం'



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న కాంట్రాక్ట్ నర్సింగ్ ఉద్యోగులు

జగదాంబ కూడలి, సెప్టెంబరు 11 : ప్రభుత్వ విక్టోరియా (ఘోషా) ఆసుపత్రి వద్ద కాంట్రాక్టు నర్సింగ్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. బుధవారం ఉదయం విధులకు హాజరయ్యే ముందు ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద నిరసనకు దిగారు. ఏఎన్‌ఎంలకు నర్సులుగా పదోన్నతి కల్పిస్తూ కౌన్సెలింగ్ నిర్వహించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేకమంది కాంట్రాక్టు నర్సింగ్ ఉద్యోగులు ఉండగా ప్రభుత్వం ఏఎన్‌ఎంలకు నర్సులుగా పదోన్నతి కల్పించే నిర్ణయాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జోక్యం చేసుకుని అడ్డదారి వ్యవహారాన్ని నిలుపుదల చేయాలని నర్సులు డిమాండ్ చేశారు. కొన్ని రోజులుగా తాము వివిధ రకాలుగా నిరసనలు తెలియజేస్తున్నామని పోరాట కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సూర్యకళ తెలిపారు. కౌన్సెలింగ్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఎన్‌సీసీ మహిళా క్యాడెట్ల ఎంపిక



క్యాడెట్ల ఎంపికలో పాల్గొన్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ అధికారులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 11: విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం ఎన్‌సీసీ కొత్త క్యాడెట్ల ఎంపికలు జరిగాయి. ప్రత్యేకంగా మహిళల కోసం నిర్వహించిన ఈ ఎంపికలో 103 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. సుబేదార్ మేజర్ బొడ్లే, సుబేదార్ అమిత్‌సింగ్, నాయక్ హుస్సేనయ్య, జీసీఐ పల్లవి పర్యవేక్షణలో జరిగిన ఎంపికలలో అభ్యర్థులకు 500 మీటర్ల పరుగు, దృష్టి పరీక్ష, అవయవాల కదలిక పరీక్ష, బాడీ మాస్ ఇండెక్స్ మూల్యాంకనం, రాత పరీక్ష నిర్వహించారు. వీటిలో రాణించిన 20 మందిని కొత్త క్యాడెట్లుగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల హాజరై విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ కె.గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.



వీల్‌చైర్‌పై క్యారియర్ తీసుకెళ్తున్న ఉద్యోగి



ఔషధాలు తరలిస్తూ...



రోగిని నడిపించుకు వెళ్తున్న దృశ్యం

కేజీహెచ్‌లో అలా 'నడిపిస్తున్నారంతే'!

- వీల్‌చైర్లపై మందులు, ఇతర సామగ్రి తరలింపు
- రోగుల అవసరాల విషయంలో నిర్లక్ష్యం

మహారాణిపేట, సెప్టెంబరు 11: కేజీహెచ్‌ను ఆపద్బాంధవిగా భావించే పేదవర్గాలు, అక్కడ కొన్ని సేవలు అందక నిట్టూర్చే పరిస్థితి ఉంటోంది. రోగులను తరలించాల్సిన వీల్‌చైర్లను ఇతర పనులకు వినియోగిస్తున్నారు. వీల్‌చైర్లు, వివిధ వైద్య పరికరాలు వందల సంఖ్యలో ఉన్నా, వాటిలో కేవలం 30 శాతం మాత్రమే రోగుల అవసరాలకు ఉపయోగిస్తున్నారు. మిగిలిన వాటిని ఆసుపత్రిలోని పలు విభాగాల వారు తమ అవసరాలకు వాడుకుంటున్నారు. వస్తు సామగ్రిని, ఔషధాలను ఒకచోట నుంచి మరో చోటుకు తీసుకువెళ్లడానికి, కొన్నివిభాగాల్లో ఏకంగా ఉద్యోగుల భోజనాల క్యారియర్లు తరలించడానికి వినియోగిస్తున్నారు.ఆసుపత్రి పరిసరాల్లో అవసరమైన సమయంలో రోగులను వీటిపై తీసుకువెళ్లడానికి ఉపయోగించడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో బాధితుల పాట్లు వర్ణనాతీతం. ఈ వీల్‌చైర్లను సీఎస్‌ఆర్ నిధుల్లో భాగంగా అనేక సంస్థలు వితరణ చేశాయి. వార్డులు, ఓపీ, క్యాజువాలిటీల్లో అవసరాలకు తగినన్ని ఉన్నాయి. క్యాజువాలిటీ, ఓపీ గేట్‌ల వద్ద వీటిని ఉంచినట్లయితే ఆసుపత్రి సిబ్బంది సమయానికి లేకున్నా రోగుల సహాయకులే నేరుగా వినియోగించుకునే అవకాశముంటుంది. వీల్‌చైర్లు లేక రోగులను నడిపించుకువెళ్లాల్సి వస్తోందని వారి సహాయకులు వాపోతున్నారు. రోగులకు ఉపయోగపడేలా వీటిని సద్వినియోగం చేయాలని అధికారులను కోరుతున్నారు

వరద బాధితులకు విరాళాలు

మహిళా సంఘాలు రూ.4.55 లక్షలు, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు రూ.3.5 లక్షలు



ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు నగదు అందచేస్తున్న మహిళలు

సీతమ్మధార, సెప్టెంబరు 11: వరద బాధితులను ఆదుకునే విధంగా సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకురాలు శ్యామల దీపిక ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గం పరిధిలోని స్వయంశక్తి సంఘాల సభ్యులు, సీఓ అండ్ ఆర్‌పీలు, డ్వాక్రా సభ్యులు రూ.4,55,560 చెక్కులను ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజుకు బుధవారం అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధికి పంపాలని కోరారు. అదే విధంగా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తన ఒక నెల జీతాన్ని, వారి కుటుంబ సభ్యులు రూ.3,50,000లను ఇచ్చినట్లు ఎమ్మెల్యే తనయ శ్యామల దీపిక తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కృష్ణ, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ ఉపకులాలకు న్యాయం జరిగే వరకు పోరాటం

దళిత హక్కుల ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ బాబు స్పష్టీకరణ



కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న రమేష్‌బాబు తదితరులు

మహారాణిపేట, సెప్టెంబరు 11: ఎస్సీల 59 ఉపకులాలకు రాజ్యాంగ బద్ధంగా న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని విశాఖ జిల్లా అఖిల భారత దళిత హక్కుల ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శి పట్టా రమేష్ బాబు స్పష్టంచేశారు. ఎస్సీ కులాల వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు తమకు అసంతృప్తి కలిగించిన నేపథ్యంలో ఆల్ ఇండియా దళిత హక్కుల ఫోరమ్ నాయకుడు, పార్లమెంట్ సభ్యుడు చంద్రశేఖర్ ఆజాద్ పిలుపు మేరకు విశాఖ జిల్లా ఏఐడీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్‌కు ర్యాలీగా వచ్చి కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు 341 ఆర్టికల్ ప్రకారం రాజ్యాంగబద్ధంగా లేదని అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు ఫుల్‌బెంచ్ ఈ తీర్పును పునఃసమీక్షించాలని కోరారు. ఎస్సీ కులాలకు న్యాయం జరిగే వరకు ఐక్యంగా పోరాడుతామన్నారు. జి.రామలింగేశ్వరరావు, డి.ఈశ్వరరావు, ఆర్.పైడిరాజు, ఎస్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాధాష్టమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో రాధారాణి

సాగర్‌నగర్, సెప్టెంబరు 11: రుషికొండలోని సాయి ప్రియా రిసార్ట్స్‌లో హరేకృష్ణ మూమెంట్ విశాఖపట్నం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి రాధాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల పూలమాలతో రాధారాణిని అలంకరించారు. అనంతరం తులసి హారతి, సంధ్యా హారతి, దివ్య ప్రవచనం, రాధాకృష్ణుల సంకీర్తనలతో ఆవరణ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నిష్కించిన భక్తదాస భక్తులకు రాధాష్టమి ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు డీఆర్‌కే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపులో భక్తులు

ఘోషాసుపత్రిలో వసతుల కల్పన

- హైరిస్క్ వార్డులో దెబ్బతిన్న సీలింగ్ పునరుద్ధరణ
- పీజీ వైద్య విద్యార్థుల గదుల ఆధునికీకరణ



ఘోషాస్పత్రిలో పునరుద్ధరించిన ప్రధాన ద్వారం

జగదాంబ కూడలి, సెప్టెంబరు 11: ప్రభుత్వ విక్టోరియా (ఘోషా) ఆసుపత్రిలో వసతుల కల్పనకు సూపరింటెండెంట్ డాక్టర్ ఉషా ప్రసాద్ చర్యలు చేపట్టారు. ఓపీ బ్లాక్‌లో వర్షం నీటితో తలెత్తుతున్న సమస్యలను తొలగించే పనులు చేపట్టారు. ప్రధాన ద్వారం వద్ద పాడైన ఇనుప గేటు స్థానంలో కొత్త గేటును ఏర్పాటు చేయించారు. గర్భిణుల కోసం వెయిటింగ్ హాల్‌లో ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. పాడైన వంటగదిని పునరుద్ధరించారు. హైరిస్క్ వార్డులో వర్షంతో ఊడిపడిన సీలింగ్ స్థానంలో కొత్తది మార్పించారు. పీజీ వైద్య విద్యార్థుల కోసం సెంటినరీ భవనంలో ప్రత్యేకంగా గదిని ఏర్పాటు చేసి అందులో వసతులను అందుబాటులోకి తెచ్చారు. విద్యార్థినులకు భద్రత ఉండేలా చర్యలు తీసుకున్నారు. అలాగే, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు మరిన్ని ఆధునాతన వైద్య సేవలతో వసతులు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఓపీ బ్లాక్ వద్ద రహదారులను పునరుద్ధరించనున్నారు.

శ్రీగౌరీ కో-ఆపరేటివ్ సొసైటీ నూతన కార్యవర్గం

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 11: శ్రీ గౌరీ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సంస్థకు నూతన పాలకవర్గం ఎంపికైంది. చైర్మన్‌గా చదరం డీవీవీ ప్రసాద్, వైఎస్ చైర్మన్‌గా అడారి నూకరాజు, ట్రెజరర్ కం ఎండీగా ఆడారి సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సభ్యుల సహాయ సహకారాలతో సొసైటీ అభివృద్ధికి శక్తి వంచనలేకుండా కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో పెంటకోట సంజీవరావు నాయుడు, శరగడం సత్యనారాయణ, మాదేటి అప్పారావు, యల్లపు రాజేశ్వరరావు, శరగడం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే జోన్‌పై తాత్సారం!

... 5వ పేజీ తరువాయి

భూములు కేటాయించారు. నిర్మాణాలు పూర్తిచేయడానికి ఎక్కువ సమయం పడుతుందని ట్రాన్సిట్ క్యాంపస్‌ని దత్తిరాజేరు సమీపాన చినమేడపల్లిలో ప్రారంభించి తరగతులు నిర్వహిస్తున్నారు.

ఇక ఏపీ మెడ్‌టెక్ జోన్‌ను అగనంపూడిలో ప్రారంభించక ముందు రుషికొండ ఐటీ పార్కులోని సింబయోసిస్ క్యాంపస్‌లో రెండేళ్లు నడిపారు. అగనంపూడిలో భవనాలు పూర్తయ్యాక అక్కడికి మార్చారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలన్నింటికి శాశ్వత భవనాల నిర్మాణం ఆలస్యం అవుతుందని తాత్కాలికంగా అద్దె భవనంలో కార్యకలాపాలు ప్రారంభించినప్పుడు రైల్వే జోన్‌కు ఆ విధానం ఎందుకు అనుసరించడం లేదనేది పెద్ద ప్రశ్న?

వేయి మందికి సరిపడా భవనాలు లేవా?

రైల్వే జోనల్ కార్యాలయం ఏర్పాటుచేస్తే 1,000 నుంచి 1,200 మంది పనిచేయడానికి అవసరమైన భవనాలు కావాలి. ఒక జనరల్ మేనేజర్, పది మంది వరకు ప్రిన్సిపల్ హెచ్‌ఓడీలు, వారి కింద 250 మంది అధికారులు, ఇంకో వేయి మంది సిబ్బంది వరకూ జోనల్ కార్యాలయంలో పనిచేస్తారు. వీరందరినీ ఒకేసారి నియమించే అవకాశం లేదు. దశల వారీగా సిబ్బందిని కేటాయిస్తారు. తొలుత 500 మందికి సరిపడా భవనం అద్దెకు తీసుకుంటే సరిపోతుంది. ఈలోగా శాశ్వత భవన నిర్మాణం ప్రారంభించి రెండేళ్లలో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసుకోవచ్చు. ఈ దిశగా కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని విశాఖ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రాంత ఎంపీలు కూడా ఈ విషయాన్ని రైల్వే మంత్రి దృష్టికి తీసుకువెళ్లి, తక్షణమే జోనల్ కార్యాలయం ఏర్పాటయ్యేలా చూడాల్సి ఉంది. అప్పుడే ఈ ప్రాంత ప్రజల కల సాకారమవుతుంది.

జల వనరుల శాఖకు రూ.44.05 కోట్లు నష్టం

... 5వ పేజీ తరువాయి

రూ.1.24 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదించారు.

జిల్లాలో రూ.867.5 లక్షల నష్టం

వర్షాలకు విశాఖ జిల్లాలో పలు శాఖలకు రూ.867.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేశారు. అత్యధికంగా ఇరిగేషన్ శాఖకు రూ.401.55 లక్షలు, వ్యవసాయ శాఖకు సంబంధించి పంటలు దెబ్బతినడంతో రూ.9.54 లక్షలు, ఉద్యానవన పంటలకు రూ.7.82 లక్షలు, పశు సంవర్ధక శాఖ పరిధిలో ఐదు పశువులు మృతి చెందడంతో రూ.1.32 లక్షలు, మత్స్యశాఖ పరిధిలో బోట్లు, వలలు ఇతర పరికరాలు దెబ్బతినగా రూ.24.36 లక్షల నష్టం వాటిల్లినట్టు గుర్తించారు. జల వనరుల శాఖలో రూ.401.55 లక్షలు నష్టం వాటిల్లింది. అలాగే పలు శాఖల పరిధిలో భవనాలు, ఇతరత్రా పనులకు సంబంధించి రూ.292.91 లక్షలు నష్టం వాటిల్లింది. అత్యవసర పనులకు రూ.84.37 లక్షలు, శాశ్వత పనులకు రూ.188.54 లక్షలు అవసరమవుతాయి. దెబ్బతిన్న బ్రిడ్జి మరమ్మతులకు రూ.0.60 లక్షలు, సామాజిక భవనాల మరమ్మతులకు రూ.137.4 లక్షలు, ఈపీడీసీఎల్ విభాగంలో రూ.2.18 లక్షలు, ఇళ్లు దెబ్బతినడంతో రూ.1.28 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. కాగా భారీవర్షాల కారణంగా పునరావాస శిబిరాలు, ఆహారం, మందులకు 76 వేల రూపాయలు వెచ్చించారు.

సాయిరెడ్డి కుమార్తెకు మరో నోటీసు

భీమిలి స్థలం హక్కుపత్రాలు సమర్పించాలని ఆదేశం

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భీమిలి బీచ్‌లోని కోస్తా నియంత్రణ మండలి పరిధి (సీఆర్‌జెడ్-1)లో ఉన్న భూమిలో శాశ్వత నిర్మాణాలు చేపట్టిన వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డికి జీవీఎంసీ అధికారులు తాజాగా మరో నోటీసు జారీచేశారు. భీమిలి బీచ్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టడంపై జనసేన నాయకుడు మూర్తియాదవ్ హైకోర్టులో కేసు వేసిన సంగతి తెలిసిందే. హైకోర్టు నిర్మాణాలు ఆపాలని సూచించినా పనులు కొనసాగించడంతో వాటిని తొలగించాలని జీవీఎంసీని కోర్టు ఆదేశించింది. దీంతో ఇక్కడి అధికారులు తీరంవైపు పునాదులు తొలగించి, మిగిలిన నిర్మాణాలు వదిలేశారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో మూర్తియాదవ్ దీనిని హైకోర్టుకు తెలియజేశారు. బుధవారం కేసు విచారణ సందర్భంగా జీవీఎంసీ అధికారులు మరో నోటీసు ఇచ్చినట్టు కోర్టుకు తెలిపారు. ఆ భూమిపై హక్కు పత్రాలు, వాటికి సంబంధించిన తాజా ఎంకంబరెన్స్ సర్టిఫికెట్, ఆ స్థలాల్లో ఉన్న పాత నిర్మాణాలకు తీసుకున్న అనుమతి పత్రాలు మూడు రోజుల్లో సమర్పించాలని నిర్మాణ సంస్థ అవ్యాన్ రియల్టర్స్ ఎల్‌ఎల్‌పీని కోరినట్టు జీవీఎంసీ అధికారులు కోర్టుకు వివరించారు. ఆ గడువులోగా వివరాలు ఇవ్వకపోతే మిగిలిన నిర్మాణాలు కూడా తొలగిస్తారా? లేదా? అనేది వేచి చూడాల్సి ఉంది.

చవితి అన్నదానాలు... నిమజ్జన ఉత్సవాలు

మురళీనగర్, సెప్టెంబరు 11; విశాఖ ఉత్తర నియోజకవర్గంలో బుధవారం ఐదో రోజు వినాయక చవితి సంబరాలు ఘనంగా జరిగాయి. పలు మండపాల వద్ద అన్నదానాలు చేపట్టారు. కొన్ని మండపాల్లో వేడుకలు ముగిసి నిమజ్జన ఉత్సవాలు నిర్వహించారు. 50వ వార్డు తెన్నేటి నగర్‌లో సినీ డైరెక్టర్ జి.లోకేష్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం జరిపారు. ఈ కార్యక్రమంలో 50వ వార్డు తెలుగుదేశం అధ్యక్షుడు సనపల. వరప్రసాద్ పాల్గొన్నారు. 51వ వార్డులో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ హాజరయ్యారు.

సీతంపేట: సీతంపేటలోని దుర్గాగణపతి ఆలయంలో బుధవారం వినాయక స్వామిని బాలగణపతిగా అలంకరించారు. దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వినాయకుడు మహాశివలింగానికి పాలతో, పూలతో అభిషేకం చేస్తున్న దుర్గాగణపతి భక్తులను ఆకట్టుకుంది. స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని గురువారం సాయంత్రం 6 గంటలకు వేలం వేయనున్నట్లు కార్పొరేటర్, ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి గోవింద్ తెలిపారు. జనసేన పార్టీ నగర కార్యాలయంలో వీర మహిళల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని భక్తులకు వడ్డించి అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం వినాయకుడి నిమజ్జన ఉత్సవాన్ని 27వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు సురేష్‌బాబు ఆర్థికసాయంతో వైభవంగా ఊరేగించారు.



భానునగర్ వీకే రెసిడెన్సీలోని ఉత్సవాల్లో కోలాట బృందం ప్రదర్శన



జనసేన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

అక్కయ్యపాలెం: వినాయక నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో అక్కయ్యపాలెం నందగిరినగర్‌లో బుధవారం భారీగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. నందగిరి సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్థానికులు పాల్గొని స్వామి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బొడ్డేటి ప్రకాష్, గేదెల వెంకన్న, రాజు, గోపీ, వెంకటరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు

- ట్రావెల్ బస్సు యజమానులకు సీఐ హెచ్చరిక



ట్రావెల్ యజమానులతో సమావేశమైన ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఎస్‌ఐ భాస్కరరావు

సీతంపేట, సెప్టెంబరు 11: రామాటాకీస్ రోడ్డు నుంచి సత్యం కూడలికి వచ్చే ప్రధాన రహదారిలో ట్రావెల్ బస్సులు అటుగా ప్రయాణించే వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇలా చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ద్వారకా ట్రాఫిక్ సీఐ ప్రసాద్ హెచ్చరించారు. రోడ్డును ఆక్రమించి బస్సులు నిలపడంతో పాటు లగేజిని రోడ్డుపైనే దించివేస్తున్నారని, ఇక నుంచి ఇలా చేసే ట్రావెల్ బస్సు యజమానులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో ప్రైవేట్ ట్రావెల్ బస్సు యజమానులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పలు సూచనలు చేశారు.



మహిళలకు పౌష్టికాహారం అందచేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సీతంపేట, సెప్టెంబరు 11: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని అలా తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా 25వ వార్డు గణేష్ నగర్‌లోని సచివాలలయంలో పౌష్టికాహార కిట్ల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గోవింద్ విచ్చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ కుమారి, మహిళా మండలి కో-ఆర్డినేటర్ హేమ, ఏఎన్‌ఎంలు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, బాలింతలు పాల్గొన్నారు.

వంతెన మార్గం ఇలా.. నడిచి వెళ్లేది ఎలా?



సిమెంటు పలకల్లో తుప్పు పట్టిన ఇనుప ఊచలు

ఎన్.ఎ.డి. జంక్షన్, సెప్టెంబరు 11: ఎన్.ఎ.డి నుంచి కాకానినగర్‌కు వెళ్లే మధ్యలో రైల్వే ట్రాక్ బ్రిడ్జిపై ఏర్పాటుచేసిన పాదచారుల మార్గం శిథిలావస్థకు చేరుకుంది. పాదచారులు నడిచేందుకు వీలుగా నిర్మించిన ఈ వంతెన చివరనున్న పలకలు, గోడ దెబ్బతిన్నాయి. పలకలు కొన్నిచోట్ల పూర్తిగా పగిలి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. అలాగే, రక్షణ గోడ చాలాచోట్ల పగుళ్లుదేరాయి. ఈ మార్గ మధ్యలో కొత్తగా వంతెనకోసం పిల్లర్లు వేస్తున్నారు. వాటికి సంబంధించి పిలర్ బీమ్ రోడ్డుపైకి వచ్చేస్తోంది. దీంతో పాదచారులు నడిచే సమయంలో వాహనాలు తమపైకి వస్తాయోమోనని ఆందోళన చెందుతున్నారు. దీంతో కేవలం ఉదయం వేళలోనే రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి వేళలో వాహనాలు ఫుట్‌పాత్ పైకి వచ్చేప్రమాదంతో అటుగా వెళ్లడంలేదు. అలాగే, కాకానినగర్ నుంచి ఎన్.ఎ.డి వైపు వచ్చే మార్గంలో కూడా ఫుట్‌పాత్ రక్షణ గోడ కూడా శిథిలమైంది.



గర్భిణులకు సీమంతం చేసి పోషకాహారాన్ని అందజేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హేమలత

గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలి

పెదగంట్యాడ, సెప్టెంబరు 11: గర్భిణులు తప్పనిసరిగా పోషకాహారాన్ని తీసుకోవాలని గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పైడి హేమలత అన్నారు. పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం గంగవరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవడం వల్ల తల్లితో పాటు కడుపులోని బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పలువురు గర్భిణులకు సీమంతం చేయడంతో పాటు పోషకాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.శాంతి, దుర్గమ్మ, వేణుశ్రీ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 11: కూర్మన్నపాలెం కేబీఆర్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా రాజీవ్ నగర్, రాసాలమ్మ కాలనీ, వుడా నగర్-1, డాక్‌యార్డు కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఆటోనగర్ పరిధిలో..

అలాగే చినగంట్యాడ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని నాయుడు తెలిపారు. అందువల్ల చినగంట్యాడ, ఎస్సీ కాలనీ, స్నేహపురి కాలనీ, కోర్టు ఏరియా, శ్రామిక నగర్, డ్రైవర్స్ కాలనీ, ఎల్‌బీఎస్ నగర్, కుంచుమాంబ కాలనీ, ఎర్రగెడ్డ కాలనీ, దత్తసాయి నగర్, చైతన్య నగర్, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని, ఈ విషయాన్ని ప్రజలు గ్రహించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

మొక్కలు నాటిన 'యాక్ట్' సభ్యులు

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 11: మొక్కలు నాటడంతో పాటు వాటిని పరిరక్షించి, పర్యావరణాన్ని కాపాడాలని అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ (యాక్ట్) సభ్యుడు ఎ.ప్రభాకరరావు అన్నారు. మాజీ డీజీపీ బి.ప్రసాదరావు జన్మదినాన్ని పురస్కరించుకుని షీలానగర్‌లో బుధవారం యాక్ట్ ఆధ్వర్యంలో సభ్యులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సభ్యులు పి.భీమారావు, పీఎం వెంకటరావు, కార్తీక్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కాకరలోవలో బోరింగ్ ప్రారంభం

సింధియా, సెప్టెంబరు 11: జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవ వాడవీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరింగును కార్పొరేటర్ గల్లా చిన్నా బుధవారం ప్రారంభించారు. స్థానికులు ఈ ప్రాంతంలో బోరింగ్ ఆవశ్యకతను కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుడేల కృష్ణ, పి.కృష్ణ, పి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

గోపాలపట్నం, సెప్టెంబరు 11: స్థానిక నరవ గ్రామంలోని బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో బెహరా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో 200 మంది విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ బెహరా విజయచైతన్య పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్:** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీకన్య, కిన్నెర, శారద, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీకాంత్ (గాజువాక).
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-12 (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), హెవెన్-3 (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు :** శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **తంగలాన్ :** నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 49, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 55, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 30, బీరకాయలు 42, ఆనపకాయ 35, కాలీఫ్లవర్ 34, క్యాబేజీ, 26, క్యారెట్ 36, దొండకాయలు 44, బంగాళదుంపలు 29, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 70, మునక్కాడలు (కిలో) 60, బీట్‌రూట్ 35, బరబాటి 42, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 105, గోరుచిక్కుడు 34, దోసకాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 105, పొటల్స్ 50, కీరదోస 32, క్యాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 54, కంద 54, దేముడు చిక్కుడు 75, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 26, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 95
ఫారం ధర	-- 115
విత్ స్కిన్	-- 200
స్కిన్‌లెస్	-- 210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



గోతులతో నిండిన ములగాడ రహదారి



రాళ్లుతేలిన పెదగంట్యాడ పారిశ్రామిక రోడ్డు

వర్షాలకు ఛిద్రంగా మారిన రోడ్లు

- మరింత గోతులమయమైన ములగాడ రహదారి
- డాక్‌యార్డు వంతెన మూసివేతతో ఈ మార్గంలో పెరిగిన వాహనాల తాకిడి
- విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రిపూట నానాపాట్లు పడుతున్నామని పలువురు వాహనదారుల ఆవేదన
- పెదగంట్యాడలో రాళ్లు తేలిన తారు రోడ్లు

మల్కాపురం, సెప్టెంబరు 11: అసలే అంతంత మాత్రంగా ఉన్న ములగాడ ప్రధాన రహదారి ఇటీవల కురుసిన భారీ వర్షాలకు మరింత ఛిద్రంగా మారింది. ఒకప్పుడు ఈ రోడ్డును ములగాడ వాసులు మాత్రమే వినియోగించేవారు. డాక్‌యార్డు వంతెనను మూసివేశాక ఇప్పుడు పారిశ్రామిక ప్రాంతంలోని అత్యధిక శాతం మంది ప్రజలు ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తున్నారు. గోతులమయంగా మారిన ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అడుక్కో గొయ్యి ఉండడంతో తమ వాహనాలు కూడా మరమ్మతులకు గురవుతున్నాయని పలువురు ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో తాము రాకపోకలు సాగించాల్సి వస్తుందని వాపోతున్నారు. వర్షాల సమయంలో ఈ మార్గంలో ప్రయాణం మరింత కష్టతరంగా ఉంటుందని, వాన నీటి వల్ల ఎక్కడ గోతులున్నాయో తెలియక వాటి మీదగా బైకుపై వెళుతూ ఒక్కోసారి కిందపడి గాయాల పాలవుతున్నామని కొంతమంది వాహనదారులు చెబుతున్నారు. రాత్రులైతే పరిస్థితి చాలా దారుణంగా ఉంటుందని, ఈ మార్గంలో ఒక విద్యుత్ దీపం కూడా లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నామని పేర్కొంటున్నారు.

డాక్‌యార్డు వద్దనున్న సర్దార్ సర్దార్‌వల్లాభాయ్ పటేల్ వంతెన మూసివేతతో తమ గ్రామం మీదగా వాహనాల రాకపోకలు అధికమయ్యాయని ములగాడ వాసులు చెబుతున్నారు. అటు నగరంలోకి, ఇటు ఎన్‌ఏడీ వైపు రాకపోకలు సాగించేందుకు ఈ మార్గాన్నే వినియోగిస్తున్నారు. ఈ మార్గంలో ప్రయాణం ఇబ్బం దికరంగా ఉంటున్నా, డాక్‌యార్డు వంతెన మూసివే యడం వల్ల తప్పనిసరి పరిస్థితుల్లో రాకపోకలు సాగించాల్సి వస్తుందని పలువురు వాహనదారులు చెబుతున్నారు. కాగా కొన్ని కంపెనీలకు చెందిన భారీ వాహనాలు కూడా ఈ మార్గం గుండానే వస్తూ, పోతుండడం వల్ల ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని స్థానికులు పేర్కొంటున్నారు. అందువల్ల ఎమ్మెల్యే గణబాబుతో పాటు కార్పొరేటర్ గులిగిందల లావణ్య స్పందించి తక్షణమే రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంతో పాటు ఈ మార్గంలో వీధి దీపాల ఏర్పాటుకు తగిన చర్యలు చేపట్టాలని పలువురు వాహనదారులతో పాటు ములగాడ, ఎదురువానిపాలెం ప్రజలు కోరుతున్నారు.

పెదగంట్యాడలో..

పెదగంట్యాడ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెదగంట్యాడ ప్రాంతంలోని అనేక రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. కొన్ని తారు రోడ్లు గోతులమయంగా మారితే, మరికొన్ని రాళ్లు తేలిపోయాయి. ఇంకొన్ని రహదారులైతే మట్టి రోడ్లుగా దర్శనమిస్తున్నాయి. నాలుగు రోజుల పాటు కుండపోతగా వర్షం కురవడంతో రోడ్లపై నీరు నిలవడం, రహదారులు, డ్రైనేజీలు ఏకమవ్వడంతో డ్రైనేజీల్లోని చెత్తాచెదారంతో నిండిపోవడం.. భారీ వాహనాలు ఆయా మార్గాల గుండానే రాకపోకలు సాగించడంతో తారురోడ్ల పరిస్థితి దయనీయంగా మారాయి. పెదగంట్యాడ పారిశ్రామికవాడలోని రోడ్లు ఎక్కువగా పాడైపోయాయి. ప్రియదర్శనీ కాలనీ నుంచి యాతపాలెం జంక్షన్‌కు వెళ్లే రోడ్డులో అనేక చోట్ల గోతులు ఏర్పడ్డాయి. కొత్తదిబ్బపాలెంలోని అనేక వీధి రోడ్లు కూడా అధ్వానంగా మారయి. దీంతో ఆయా మార్గాలలో రాకపోకలు సాగించేందుకు నానాపాట్లు పడుతున్నామని ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల జీవీఎంసీ అధికారులు స్పందించి తక్షణమే ఛిద్రంగా మారిన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, సెప్టెంబరు 11: ప్రజా సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సూచించారు. సుజాతనగర్ 80 అడుగుల రోడ్డు సమీపం రత్నగిరి కాలనీలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన ప్రజాదర్బార్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పంచకర్ల పలువురి నుంచి వినతులను స్వీకరించారు. పెందుర్తిలోని పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, ప్రాంగణంలోని పిచ్చిమొక్కలను తొలగించాలని, పందులు, కుక్కలు బెడద నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ ఎమ్మెల్యేకు వినతిప త్రాన్ని అందజేశారు. పెదగంట్యాడ మండలంలోని ముస్లిం మైనారిటీ సంఘం ప్రతినిధులు తమ సమస్యలను విన్నవించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో డీజే సౌండ్స్ ఏర్పాటుపై సీపీతో చర్చించి అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ ఉత్తరాంధ్ర ఈవెంట్స్ అసోసియేషన్ సభ్యులు పంచకర్ల రమేశ్‌బాబుకు అర్జీ అందించారు. నియోజకవర్గ పరిధిలోని పెందుర్తి, సబ్బవరం, పరవాడ, పెదగంట్యాడ మండలాల్లో పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వినతులు వచ్చాయి. కార్యక్రమంలో నాయకులు అయితి సింహాచలం, బలిరెడ్డి అప్పారావు, రెడ్డి నారాయణరావు, డీబీఎల్ నాయుడు, కంచిపాటి మధు, సేనాపతి సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'సింహాచలం' పరిధిలోకి ములగాడ కొండలు

దేవస్థానం, దేవదాయశాఖ అధికారులు, ఆర్‌డీవోల ఆధ్వర్యంలో సర్వే

మల్కాపురం, సెప్టెంబరు 11: ములగాడ మండల పరిధిలోని 500 ఎకరాల మేర విస్తరించిన కొండలపై గల భూములను సింహాచలం దేవస్థానానికి అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ములగాడ సర్వే నంబర్ 55, గుల్లలపాలెం సర్వే నంబర్ 35, మల్కాపురం సర్వేనంబర్ 14 పరిధిలో ఈ భూములున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఆర్‌డీవో, రాష్ట్ర దేవాదాయ ముఖ్యఅధికారి, సింహాచలం దేవస్థానం అధికారులు కలిసి బుధవారం ములగాడ మండల పరిధిలో ఈ కొండలను పరిశీలించారు. సింహాచలం దేవస్థానం భూముల్లో పక్కా నిర్మాణాలు వెలసిన నేపథ్యంలో వాటిని తొలగించడం సాధ్యం కావడంలేదు. ఆ భూములకు బదులుగా సింహాచలం దేవస్థానానికి ప్రభుత్వం భూమి ఇస్తే సరిపోతుందని ప్రభుత్వ పెద్దలు నిర్ణయించిన తర్వాత ములగాడ మండలంలో కొండలను అధికారులు పరిశీలించడం చర్చనీయాంశంగా మారింది. ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్ ములగాడ రెవెన్యూ కార్యాలయానికి వచ్చి సంబంధిత భూములకు సంబంధించి మ్యాప్‌ను దేవదాయ శాఖ అధికారులకు చూపారు. అనంతరం ఆయా అధికారులు కొండలపై సర్వే నిర్వహించారు.



ఉక్కు డీజీఎం రాధికను సత్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు

అవార్డు గ్రహీత ఉక్కు డీజీఎంకు సత్కారం

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 11: ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో జెండర్ డైవర్సిటీ అవార్డు సాధించిన స్టీల్‌ప్లాంట్ డీజీఎం (హెచ్‌ఆర్) డి.రాధికను ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ప్లాంటులో సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి బయ్యే మల్లయ్య మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటులో చేసిన సేవలకు గాను అవార్డు లభించడం గొప్ప విషయమన్నారు. ఉద్యోగులకు మరిన్ని సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బొండా తౌడన్న, కొమ్ము ప్రసాదరావు, ఎస్.సత్యనారాయణ, కనకరాజు, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

గాజువాక, సెప్టెంబరు 11: ప్రభుత్వ స్టీల్ సిటీ ఐటీఐలోని డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ మోటార్ వెహికల్ శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు కనీస విద్యార్హత పదో తరగతి అని, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఎల్‌ఎల్‌ఆర్ కలిగి ఉ ఉండడంతో పాటు 18 ఏళ్లు నిండిన అభ్యర్థులు ఈ నెల 23వ తేదీలోగా ఐటీఐలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9491962841 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వెండి కవచధారణతో గణేశునికి పూజలు



అగనంపూడి, సెప్టెంబరు 11: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక సంపత్ వినాయక ఆలయంలో గణపతి నవరాత్రులను పురస్కరించుకుని బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా స్వామివారిని వెండి కవచధారణతో అలంకరించి వెండి పుష్పార్చన, అష్టోత్తర శతనామార్చన, నక్షత్రహారతి పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మోటూరి వెంకటరమణ, నెల్లి శ్రీనివాసరావు, ఎం.నరసింగరావు, వి.నారాయణరావు, డి.అప్పలనాయుడు, ఎం.శ్రీనివాసరావు, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

గాజువాక, సెప్టెంబరు 11: గాజువాక ప్రాంతంలోని దోమల నివారణకు పలుచోట్ల జీవీఎంసీ సిబ్బంది బుధవారం ఫాగింగ్ చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండిపోవడం, కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవటం వంటి కారణాలతో దోమల వ్యాప్తి చెందుతున్నాయి. వీటి నివారణకు జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. దోమల నియంత్రణకు ప్రజలు సహకరించాలని, తమ పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చేసుకోవాలని జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు కోరారు.

నిత్యావసర సరకులు పంపిణీ

అగనంపూడి, సెప్టెంబరు 11: జీవీఎంసీ 79, 85వ వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉంటున్న నిరుపేద కుటుంబాలకు సర్వహిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు గుదే సుశీల గజేంద్రరావు మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు.

గణేశులను దర్శించుకున్న 'జియ్యాని'

ఎన్.ఎ.డిజంక్షన్, సెప్టెంబరు 11: జీవీఎంసీ 52వ వార్డు పరిధి ఎన్‌ఏడీ కొత్తరోడ్డు, కరాస, శాంతినగర్, వుడా కాలనీ పరిసరాల్లో నెలకొల్పిన వినాయక మండపాలను బుధవారం ఉదయం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దర్శించుకుని పూజలు చేశారు. 90వ వార్డు బుచ్చిరాజుపాలెం పైడితల్లెమ్మ అమ్మవారి ఆలయం వద్ద వినాయకచవితి మండపంలోని స్వామివారిని గోపాలపట్నం తహసీల్దార్ సి.హెచ్.వి.రమేష్‌కుమార్ దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనను ప్రారంభించారు. ఉత్సవ నిర్వాహకుడు గంటల ప్రసాద్, డీటీ సువర్ణబాయ్, ఆర్.ఐ. సురేశ్‌కుమార్, వంశీ, జిమ్స్ అధినేత పురుషోత్తం, భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ మణికంఠ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం'

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 11: ప్రజల ఆశయాలకు అనుగుణంగా దేశాభివృద్ధి ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ నాయకుడు గవర వెంకటరమణారావు అన్నారు. బెల్ హెచ్‌పీవీపీ టౌన్‌షిప్‌లో బుధవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ గాజువాక ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీలో గాజువాకకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఉరుకూటి అచ్చిబాబు, కొవిరి దేముడు, మాచిపాడు స్వర్ణ, పల్లెల శ్రీనివాసరావు, సీహెచ్ మురళీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చీమలాపల్లిలో అన్న సమారాధన

పెందుర్తిరూరల్, సెప్టెంబరు 11: గ్రేటర్ 95వ వార్డు పరిధి చీమలాపల్లి కోదండరామయ్య ఆలయంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్న సమారాధన చేపట్టారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు ముఖ్యఅతిథిగా విచ్చేసి ముందుగా గణేశునికి పూజలు చేశారు. అనంతరం మండపం వద్ద అన్న సమారాధనను ప్రారంభించారు. అర్చకుడు శ్రీనివాసాచార్యులు, ధర్మకర్త అయిత ఎర్రయ్య, కమిటీ సభ్యులు మింది నాగరాజు, దువ్వి అప్పారావు, వెంకట సంతోశ్, గోవింద్, పరదేశినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



పెదగంట్యాడ నిర్వాసిక కాలనీలోని గెడ్డలో పూడికలను తొలగిస్తున్న దృశ్యం

ప్రధాన గెడ్డల్లో పూడికల తొలగింపు

పెదగంట్యాడ, సెప్టెంబరు 11: పెదగంట్యాడ నిర్వాసిత కాలనీల పరిసరాల్లోని ప్రధాన గెడ్డల్లోని పూడికల తొలగింపు పనులు చేపట్టారు. జీవీఎంసీకి చెందిన ఒక ఎక్స్‌కవేటర్, అదానీ గంగవరం పోర్టుకు చెందిన మరో ఎక్స్‌కవేటర్ ద్వారా పూడికలను తొలగిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నిర్వాసిత కాలనీల నుంచి, డ్రైనేజీల నుంచి వర్షపు నీటితో పాటు పూడికలు పెద్దఎత్తున ప్రధాన గెడ్డల్లోకి చేరాయి. దీంతో డ్రైనేజీల్లోని మురుగు నీరు దిగువకు సజావుగా వెళ్లకపోడాన్ని గుర్తించిన 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి.. ఈ విషయాన్ని గాజువాక జోన్ అధికారులకు, అదానీ గంగవరం పోర్టు అధికారులకు తెలియజేసి, పూడికల తొలగింపునకు సహకరించాలని కోరారు. ఈ మేరకు వారు కేటాయించిన రెండు ఎక్స్‌కవేటర్లతో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి దగ్గరుండి పూడికలను తీసున్తున్నారు. నిర్వాసిత కాలనీల్లోని మరికొన్ని గెడ్డల్లోని పూడికల తొలగింపు పనులు మరో రెండు రోజుల పాటు కొనసాగనున్నాయి.

ఎస్సీ వర్గీకరణ వద్దంటూ ప్రతిఘటన ర్యాలీ



కూర్మన్నపాలెంలో కూడలిలో ర్యాలీలో పాల్గొన్న దళితులు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 11: సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం కూర్మన్నపాలెం కూడలిలో ప్రతిఘటన ర్యాలీని నిర్వహించారు. పూలే అంబేడ్కర్ విజ్ఞాన వేదిక అధ్యక్షుడు కేబీఆర్ అంబేడ్కర్, రాష్ట్ర మాల మహానాడు నాయకుడు గాలి ఆనంద్ మాట్లాడుతూ గతనెల ఆగస్టు ఒకటిన సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని, అందువల్ల దీనిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మాల మహానాడు నాయకుడు బలిరెడ్డి నాగేశ్వరరావు మాట్లాడుతూ రిజర్వేషన్లు అన్నవి కేంద్రం, పార్లమెంటు పరిధిలో ఉండే అంశాలని, దీనిని రాష్ట్రాలకు బదలాయించడం రాజ్యాంగానికే అవమానమన్నారు. ఏఐడీఆర్ఎఫ్ అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సుప్రీంతీర్పు తమ తీర్పును పునఃసమీక్షించాలన్నారు. దళితసేన రాష్ట్ర నాయకుడు పాల్తేటి పెంటారావు మాట్లాడుతూ వర్గీకరణ వద్దు-దళితుల ఐక్యతే ముద్దు అని పేర్కొన్నారు. అనంతరం బైక్ ర్యాలీ చేపట్టాక చలో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ టి.శ్రీవల్లికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జగ్జీవన్‌రావు, రత్నం, రాజు, స్వామి, రమణ, శ్రీకాంత్, శ్యామ్, భాను, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 11: గ్రేటర్ 68వ వార్డు పరిధిలోని రామ్‌నగర్ ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది హాజరు పట్టికతో పాటు జాతీయ కార్యక్రమాల అమలు, లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌పై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు శత శాతం సాధించేందుకు ప్రయత్నించాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలో సీ-సెక్షన్ ప్రసవాలను నివారించి సాధారణ ప్రసవాలు జరిగేలా ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు ప్రయత్నించాలన్నారు. ఆయన వెంట డాక్టర్ ఉమాపతి, బి.నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ప్రజల ధర్మం

ఆటోనగర్, సెప్టెంబరు 11: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ప్రజలందరి ధర్మమని వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూప్-సింహాద్రి టీఎంటీ డైరెక్టర్ వీవీ కృష్ణారావు అన్నారు. బుధవారం వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూప్-సింహాద్రి టీఎంటీ, ఒడిశా స్టీవ్ డోర్స్, హిమ హ్యూమానిటేరియన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల కోసం దుస్తులు, రగ్గులు, టవళ్లు, బ్రెడ్లు, రస్కులు, నిత్యావసర సరకులు, పండ్లు తదితర సామగ్రిని పంపి, స్వయంగా తమ సభ్యులతో బాధితులకు పంపిణీ చేశామన్నారు. హిమ హ్యూమానిటేరియన్ సంస్థ సభ్యుడు టీడీడీ దాస్ మాట్లాడుతూ ఆపత్కాలంలో తోటివారికి సాయం చేయడం ఆత్మ సంతృప్తినిఇస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు ప్రభాత్, కుమార్, కాశీ, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్ల నిర్వహణపై దృష్టిసారించాలి

అగనంపూడి, సెప్టెంబరు 11: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఇ-మర్రిపాలెం, గొన్నవానిపాలెం, పరిసర ప్రాంతాల్లో వీధి లైట్లు సక్రమంగా వెలిగేలా జీవీఎంసీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మీరామునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వీధి లైట్లు ఎప్పుడె వెలుగుతాయో, ఎప్పుడు ఆగుతాయో తెలియని దుస్థితి నెలకొందన్నారు. పలుచోట్ల లైట్లు వెలగకపోవడతో రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇ-మర్రిపాలెంలో గత వారం రోజులుగా పగలే వీధిలైట్లు వెలుగుతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదన్నారు. అందువల్ల ఉన్నతాధికారులు స్పందించి వీధి లైట్లు సక్రమంగా వెలిగేలా చూడాలని కోరారు.

సెంట్రల్ అడిషనల్ పీఎఫ్ కమిషనర్‌కు ఇంటక్ వినతి

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 11: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ ఇచ్చే విషయంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతుందని, ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సెంట్రల్ అడిషనల్ పీఎఫ్ కమిషనర్ ఏకే సింగ్‌కు ఇంటక్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, అదనపు ప్రధాన కార్యదర్శి బీఎస్ రాజులు బుధవారం ఢిల్లీలో వినతిపత్రం అందజేశారు. హయ్యర్ పెన్షన్ కోసం సుమారు నాలుగు వేల మంది ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు కోట్లాది రూపాయలు చెల్లించారని, కానీ వారికి అలా ఇవ్వడం ఇవ్వడం లేదన్నారు. పలు సంస్థల ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ ఇస్తున్నా, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఇవ్వడంలేదన్నారు. అందువల్ల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ఘనంగా ధ్యాన విద్యాలయ ఆవిర్భావ దినోత్సవం

పెందుర్తి రూరల్, సెప్టెంబరు 11: చింతలఅగ్రహారంలోని శాంతి ధ్యాన విద్యాలయం ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ పిరమిడ్ మాస్టార్ మళ్ల సోమేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి.అప్పారావు మాట్లాడుతూ ధ్యానం వల్ల ఆధ్యాత్మిక చింతన, మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. అనంతరం రెండు గంటల పాటు సామూహిక ధ్యానం చేశారు. పిరమిడ్ మాస్టార్లు పి.జగదీశ్, శశిదేవి, కోటిమంగలు, తదితరులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మి ఆలయానికి రూ.25.37 లక్షల ఆదాయం



అమ్మవారి హుండీ ఆదాయం లెక్కిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది, పర్యవేక్షిస్తున్న అధికారులు

జగదాంబ కూడలి, సెప్టెంబరు 11: వన్‌టౌన్ కనకమహాలక్ష్మి అమ్మవారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఆగస్టు 3 నుంచి ఈనెల 11 వరకు 40 రోజులకు హుండీ ఆదాయం రూ.25,37,268 వచ్చినట్లు ఈవో శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. అదేవిధంగా అమ్మవారికి బంగారం 115-100 మిల్లీగ్రాములు, వెండి 742 గ్రాములు, విదేశీ కరెన్సీ వచ్చినట్లు తెలిపారు. కానుకల లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారులు కె.సీలిమ, జేఈవో వి.రాంబాబు, కె.తిరుమలేశ్వరరావు, శ్రీహరి సేవ భక్తులు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, యూనియన్ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

'అడ్డదారి పదోన్నతులు అంగీకరించం'



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న కాంట్రాక్ట్ నర్సింగ్ ఉద్యోగులు

జగదాంబ కూడలి, సెప్టెంబరు 11 : ప్రభుత్వ విక్టోరియా (ఘోషా) ఆసుపత్రి వద్ద కాంట్రాక్టు నర్సింగ్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. బుధవారం ఉదయం విధులకు హాజరయ్యే ముందు ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద నిరసనకు దిగారు. ఏఎన్ఎంలకు నర్సులుగా పదోన్నతి కల్పిస్తూ కౌన్సెలింగ్ నిర్వహించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేకమంది కాంట్రాక్టు నర్సింగ్ ఉద్యోగులు ఉండగా ప్రభుత్వం ఏఎన్ఎంలకు నర్సులుగా పదోన్నతి కల్పించే నిర్ణయాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జోక్యం చేసుకుని అడ్డదారి వ్యవహారాన్ని నిలుపుదల చేయాలని నర్సులు డిమాండ్ చేశారు. కొన్ని రోజులుగా తాము వివిధ రకాలుగా నిరసనలు తెలియజేస్తున్నామని పోరాట కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సూర్యకళ తెలిపారు. కౌన్సెలింగ్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఎన్‌సీసీ మహిళా క్యాడెట్ల ఎంపిక



క్యాడెట్ల ఎంపికలో పాల్గొన్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ అధికారులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 11: విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం ఎన్‌సీసీ కొత్త క్యాడెట్ల ఎంపికలు జరిగాయి. ప్రత్యేకంగా మహిళల కోసం నిర్వహించిన ఈ ఎంపికలో 103 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. సుబేదార్ మేజర్ బొడ్డే, సుబేదార్ అమిత్‌సింగ్, నాయక్ హుస్సేనయ్య, జీసీఐ పల్లవి పర్యవేక్షణలో జరిగిన ఎంపికలలో అభ్యర్థులకు 500 మీటర్ల పరుగు, దృష్టి పరీక్ష, అవయవాల కదలిక పరీక్ష, బాడీ మాస్ ఇండెక్స్ మూల్యాంకనం, రాత పరీక్ష నిర్వహించారు. వీటిలో రాణించిన 20 మందిని కొత్త క్యాడెట్లుగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల హాజరై విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ కె.గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.



వీల్‌చైర్‌పై క్యారియర్ తీసుకెళ్తున్న ఉద్యోగి



ఔషధాలు తరలిస్తూ...



రోగిని నడిపించుకు వెళ్తున్న దృశ్యం

కేజీహెచ్‌లో అలా 'నడిపిస్తున్నారంతే'!

- వీల్‌చైర్లపై మందులు, ఇతర సామగ్రి తరలింపు
- రోగుల అవసరాల విషయంలో నిర్లక్ష్యం

మహారాణిపేట, సెప్టెంబరు 11: కేజీహెచ్‌ను ఆపద్బాంధవిగా భావించే పేదవర్గాలు, అక్కడ కొన్ని సేవలు అందక నిట్టూర్చే పరిస్థితి ఉంటోంది. రోగులను తరలించాల్సిన వీల్‌చైర్లను ఇతర పనులకు వినియోగిస్తున్నారు. వీల్‌చైర్లు, వివిధ వైద్య పరికరాలు వందల సంఖ్యలో ఉన్నా, వాటిలో కేవలం 30 శాతం మాత్రమే రోగుల అవసరాలకు ఉపయోగిస్తున్నారు. మిగిలిన వాటిని ఆసుపత్రిలోని పలు విభాగాల వారు తమ అవసరాలకు వాడుకుంటున్నారు. వస్తు సామగ్రిని, ఔషధా లను ఒకచోట నుంచి మరో చోటుకు తీసుకువెళ్లడానికి, కొన్నివిభాగాల్లో ఏకంగా ఉద్యోగుల భోజనాల క్యారియర్లు తరలిం చడానికి వినియోగిస్తున్నారు.ఆసుపత్రి పరిసరాల్లో అవసరమైన సమయంలో రోగులను వీటిపై తీసుకువెళ్లడానికి ఉపయోగించడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో బాధితుల పాట్లు వర్ణనాతీతం. ఈ వీల్‌చైర్లను సీఎస్ఆర్ నిధుల్లో భాగంగా అనేక సంస్థలు వితరణ చేశాయి. వార్డులు, ఓపీ, క్యాజువాలిటీల్లో అవసరాలకు తగినన్ని ఉన్నాయి. క్యాజువాలిటీ, ఓపీ గేట్‌ల వద్ద వీటిని ఉంచినట్లయితే ఆసుపత్రి సిబ్బంది సమయానికి లేకున్నా రోగుల సహాయకులే నేరుగా వినియోగించుకునే అవకాశముం టుంది. వీల్‌చైర్లు లేక రోగులను నడిపించుకువెళ్లాల్సి వస్తోందని వారి సహాయకులు వాపోతున్నారు. రోగులకు ఉపయోగపడేలా వీటిని సద్వినియోగం చేయాలని అధికారులను కోరుతున్నారు

వరద బాధితులకు విరాళాలు

మహిళా సంఘాలు రూ.4.55 లక్షలు, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు రూ.3.5 లక్షలు



ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు నగదు అందచేస్తున్న మహిళలు

సీతమ్మధార, సెప్టెంబరు 11: వరద బాధితులను ఆదుకునే విధంగా సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకురాలు శ్యామల దీపిక ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గం పరిధిలోని స్వయంశక్తి సంఘాల సభ్యులు, సీఓ అండ్ ఆర్‌పీలు, డ్వాక్రా సభ్యులు రూ.4,55,560 చెక్కులను ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజుకు బుధవారం అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధికి పంపాలని కోరారు. అదే విధంగా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తన ఒక నెల జీతాన్ని, వారి కుటుంబ సభ్యులు రూ.3,50,000లను ఇచ్చినట్లు ఎమ్మెల్యే తనయ శ్యామల దీపిక తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కృష్ణ, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ ఉపకులాలకు న్యాయం జరిగే వరకు పోరాటం

దళిత హక్కుల ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ బాబు స్పష్టీకరణ



కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న రమేష్‌బాబు తదితరులు

మహారాణిపేట, సెప్టెంబరు 11: ఎస్సీల 59 ఉపకులాలకు రాజ్యాంగ బద్ధంగా న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని విశాఖ జిల్లా అఖిల భారత దళిత హక్కుల ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శి పట్టా రమేష్ బాబు స్పష్టంచేశారు. ఎస్సీ కులాల వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు తమకు అసంతృప్తి కలిగించిన నేపథ్యంలో అల్ ఇండియా దళిత హక్కుల ఫోరమ్ నాయకుడు, పార్లమెం ట్ సభ్యుడు చంద్రశేఖర్ ఆజాద్ పిలుపు మేరకు విశాఖ జిల్లా ఏఐడీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్‌కు ర్యాలీగా వచ్చి కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు 341 ఆర్టికల్ ప్రకారం రాజ్యాంగబద్ధంగా లేదని అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు ఫుల్‌బెంచ్ ఈ తీర్పును పునఃసమీక్షించాలని కోరారు. ఎస్సీ కులాలకు న్యాయం జరిగే వరకు ఐక్యంగా పోరాడుతామన్నారు. జి.రామలింగేశ్వరరావు, డి.ఈశ్వరరావు, ఆర్.పైడిరాజు, ఎస్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాధాష్టమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో రాధారాణి

సాగర్‌నగర్, సెప్టెంబరు 11: రుషికొండలోని సాయి ప్రియా రిసార్ట్స్‌లో హరేకృష్ణ మూమెంట్ విశాఖపట్నం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి రాధాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల పూలమాలతో రాధారాణిని అలంకరించారు. అనం తరం తులసి హారతి, సంధ్యా హారతి, దివ్య ప్రవచనం, రాధాకృష్ణుల సంకీర్తనలతో ఆవరణ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నిష్కించిన భక్తదాస భక్తులకు రాధాష్టమి ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు డీఆర్‌కే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపులో భక్తులు

చవితి అన్నదానాలు... నిమజ్జన ఉత్సవాలు

మురళీనగర్, సెప్టెంబరు 11; విశాఖ ఉత్తర నియోజకవర్గంలో బుధవారం అయిదో రోజు వినాయక చవితి సంబరాలు ఘనంగా జరిగాయి. పలు మండపాల వద్ద అన్నదానాలు చేపట్టారు. కొన్ని మండపాల్లో వేడుకలు ముగిసి నిమజ్జన ఉత్సవాలు నిర్వహించారు. 50వ వార్డు తెన్నేటి నగర్‌లో సినీ డైరెక్టర్ జి.లోకేష్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం జరిపారు. ఈ కార్యక్రమంలో 50వ వార్డు తెలుగుదేశం అధ్యక్షుడు సనపల. వరప్రసాద్ పాల్గొన్నారు. 51వ వార్డులో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ హాజరయ్యారు.

సీతంపేట: సీతంపేటలోని దుర్గాగణపతి ఆలయంలో బుధవారం వినాయక స్వామిని బాలగణపతిగా అలంకరించారు. దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వినాయకుడు మహాశివలింగానికి పాలతో, పూలతో అభిషేకం చేస్తున్న దుర్గాగణపతి భక్తులను ఆకట్టుకుంది. స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని గురువారం సాయంత్రం 6 గంటలకు వేలం వేయనున్నట్లు కార్పొరేటర్, ఉత్సవ కమిటీ ఛైర్మన్ సారిపిల్లి గోవింద్ తెలిపారు. జనసేన పార్టీ నగర కార్యాలయంలో వీర మహిళల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని భక్తులకు వడ్డించి అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం వినాయకుడి నిమజ్జన ఉత్సవాన్ని 27వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు సురేష్‌బాబు ఆర్థికసాయంతో వైభవంగా ఊరేగించారు.



జనసేన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



భానునగర్ వీకే రెసిడెన్సీలోని ఉత్సవాల్లో కోలాట బృందం ప్రదర్శన

అక్కయ్యపాలెం: వినాయక నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో అక్కయ్యపాలెం నందగిరినగర్‌లో బుధవారం భారీగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. నందగిరి సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్థానికులు పాల్గొని స్వామి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బొడ్డేటి ప్రకాష్, గేదెల వెంకన్న, రాజు, గోపీ, వెంకటరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు

- ట్రావెల్ బస్సు యజమానులకు సీఐ హెచ్చరిక



ట్రావెల్ యజమానులతో సమావేశమైన ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఎస్ఐ భాస్కరరావు

సీతంపేట, సెప్టెంబరు 11: రామాటాకీస్ రోడ్డు నుంచి సత్యం కూడలికి వచ్చే ప్రధాన రహదారిలో ట్రావెల్ బస్సులు అటుగా ప్రయాణించే వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇలా చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ద్వారకా ట్రాఫిక్ సీఐ ప్రసాద్ హెచ్చరించారు. రోడ్డును ఆక్రమించి బస్సులు నిలపడంతో పాటు లగేజిని రోడ్డుపైనే దించివేస్తున్నారని, ఇక నుంచి ఇలా చేసే ట్రావెల్ బస్సు యజమానులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో ప్రైవేట్ ట్రావెల్ బస్సు యజమానులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పలు సూచనలు చేశారు.



మహిళలకు పౌష్టికాహారం అందచేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సీతంపేట, సెప్టెంబరు 11: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని అలా తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా 25వ వార్డు గణేష్ నగర్‌లోని సచివాలలయంలో పౌష్టికాహార కిట్ల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గోవింద్ విచ్చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ కుమారి, మహిళా మండలి కో-ఆర్డినేటర్ హేమ, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, బాలింతలు పాల్గొన్నారు.

ఘోషాసుపత్రిలో వసతుల కల్పన

- హైరిస్క్ వార్డులో దెబ్బతిన్న సీలింగ్ పునరుద్ధరణ
- పీజీ వైద్య విద్యార్థుల గదుల ఆధునికీకరణ



ఘోషాసుపత్రిలో పునరుద్దరించిన ప్రధాన ద్వారం

జగదాంబ కూడలి, సెప్టెంబరు 11: ప్రభుత్వ విక్టోరియా (ఘోషా) ఆసుపత్రిలో వసతుల కల్పనకు సూపరింటెండెంట్ డాక్టర్ ఉషా ప్రసాద్ చర్యలు చేపట్టారు. ఓపీ బ్లాక్‌లో వర్షం నీటితో తలెత్తుతున్న సమస్యలను తొలగించే పనులు చేపట్టారు. ప్రధాన ద్వారం వద్ద పాడైన ఇనుప గేటు స్థానంలో కొత్త గేటును ఏర్పాటు చేయించారు. గర్భిణుల కోసం వెయిటింగ్ హాల్‌లో ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. పాడైన వంటగదిని పునరుద్ధరించారు. హైరిస్క్ వార్డులో వర్షంతో ఊడిపడిన సీలింగ్ స్థానంలో కొత్తది మార్పించారు. పీజీ వైద్య విద్యార్థుల కోసం సెంటినరీ భవనంలో ప్రత్యేకంగా గదిని ఏర్పాటు చేసి అందులో వసతులను అందుబాటులోకి తెచ్చారు. విద్యార్థినులకు భద్రత ఉండేలా చర్యలు తీసుకున్నారు. అలాగే, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు మరిన్ని ఆధునాతన వైద్య సేవలతో వసతులు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఓపీ బ్లాక్ వద్ద రహదారులను పునరుద్ధరించనున్నారు.

శ్రీగౌరీ కో-ఆపరేటివ్ సొసైటీ నూతన కార్యవర్గం

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 11: శ్రీ గౌరీ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సంస్థకు నూతన పాలకవర్గం ఎంపికైంది. ఛైర్మన్‌గా చదరం డీవీవీ ప్రసాద్, వైస్ ఛైర్మన్‌గా అడారి నూకరాజు, ట్రెజరర్ కం ఎండీగా ఆడారి సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ సభ్యుల సహాయ సహకారాలతో సొసైటీ అభివృద్ధికి శక్తి వంచనలేకుండా కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో పెంటకోట సంజీవరావు నాయుడు, శరగడం సత్యనారాయణ, మాదేటి అప్పారావు, యల్లపు రాజేశ్వరరావు, శరగడం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే జోన్‌పై తాత్సారం!

... 5వ పేజీ తరువాయి

భూములు కేటాయించారు. నిర్మాణాలు పూర్తిచేయడానికి ఎక్కువ సమయం పడుతుందని ట్రాన్సిట్ క్యాంపస్‌ని దత్తిరాజేరు సమీపాన చినమేడపల్లిలో ప్రారంభించి తరగతులు నిర్వహిస్తున్నారు.

ఇక ఏపీ మెడ్‌టెక్ జోన్‌ను అగనంపూడిలో ప్రారంభించక ముందు రుషికొండ ఐటీ పార్కులోని సింబయోసిస్ క్యాంపస్‌లో రెండేళ్లు నడిపారు. అగనంపూడిలో భవనాలు పూర్తయ్యాక అక్కడికి మార్చారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలన్నింటికి శాశ్వత భవనాల నిర్మాణం ఆలస్యం అవుతుందని తాత్కాలికంగా అద్దె భవనంలో కార్యకలాపాలు ప్రారంభించినప్పుడు రైల్వే జోన్‌కు ఆ విధానం ఎందుకు అనుసరించడం లేదనేది పెద్ద ప్రశ్న?

వేయి మందికి సరిపడా భవనాలు లేవా?

రైల్వే జోనల్ కార్యాలయం ఏర్పాటుచేస్తే 1,000 నుంచి 1,200 మంది పనిచేయడానికి అవసరమైన భవనాలు కావాలి. ఒక జనరల్ మేనేజర్, పది మంది వరకు ప్రిన్సిపల్ హెచ్ఓడీలు, వారి కింద 250 మంది అధికారులు, ఇంకో వేయి మంది సిబ్బంది వరకూ జోనల్ కార్యాలయంలో పనిచేస్తారు. వీరందరినీ ఒకేసారి నియమించే అవకాశం లేదు. దశల వారీగా సిబ్బందిని కేటాయిస్తారు. తొలుత 500 మందికి సరిపడా భవనం అద్దెకు తీసుకుంటే సరిపోతుంది. ఈలోగా శాశ్వత భవన నిర్మాణం ప్రారంభించి రెండేళ్లలో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసుకోవచ్చు. ఈ దిశగా కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని విశాఖ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రాంత ఎంపీలు కూడా ఈ విషయాన్ని రైల్వే మంత్రి దృష్టికి తీసుకువెళ్లి, తక్షణమే జోనల్ కార్యాలయం ఏర్పాటయ్యేలా చూడాల్సి ఉంది. అప్పుడే ఈ ప్రాంత ప్రజల కల సాకారమవుతుంది.

జల వనరుల శాఖకు రూ.44.05 కోట్లు నష్టం

... 5వ పేజీ తరువాయి

రూ.1.24 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదించారు.

జిల్లాలో రూ.867.5 లక్షల నష్టం

వర్షాలకు విశాఖ జిల్లాలో పలు శాఖలకు రూ.867.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. అత్యధికంగా ఇరిగేషన్ శాఖకు రూ.401.55 లక్షలు, వ్యవసాయ శాఖకు సంబంధించి పంటలు దెబ్బతినడంతో రూ.9.54 లక్షలు, ఉద్యానవన పంటలకు రూ.7.82 లక్షలు, పశు సంవర్ధక శాఖ పరిధిలో ఐదు పశువులు మృతి చెందడంతో రూ.1.32 లక్షలు, మత్స్యశాఖ పరిధిలో బోట్లు, వలలు ఇతర పరికరాలు దెబ్బతినగా రూ.24.36 లక్షల నష్టం వాటిల్లినట్టు గుర్తించారు. జల వనరుల శాఖలో రూ.401.55 లక్షలు నష్టం వాటిల్లింది. అలాగే పలు శాఖల పరిధిలో భవనాలు, ఇతరత్రా పనులకు సంబంధించి రూ.292.91 లక్షలు నష్టం వాటిల్లింది. అత్యవసర పనులకు రూ.84.37 లక్షలు, శాశ్వత పనులకు రూ.188.54 లక్షలు అవసరమవుతాయి. దెబ్బతిన్న బ్రిడ్జి మరమ్మతులకు రూ.0.60 లక్షలు, సామాజిక భవనాల మరమ్మతులకు రూ.137.4 లక్షలు, ఈపీడీసీఎల్ విభాగంలో రూ.2.18 లక్షలు, ఇళ్లు దెబ్బతినడంతో రూ.1.28 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. కాగా భారీవర్షాల కారణంగా పునరావాస శిబిరాలు, ఆహారం, మందులకు 76 వేల రూపాయలు వెచ్చించారు.

సాయిరెడ్డి కుమార్తెకు మరో నోటీసు

భీమిలి స్థలం హక్కుపత్రాలు సమర్పించాలని ఆదేశం


విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భీమిలి బీచ్‌లోని కోస్తా నియంత్రణ మండలి పరిధి (సీఆర్‌జెడ్-1)లో ఉన్న భూమిలో శాశ్వత నిర్మాణాలు చేపట్టిన వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డికి జీవీఎంసీ అధికారులు తాజాగా మరో నోటీసు జారీచేశారు. భీమిలి బీచ్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టడంపై జనసేన నాయకుడు మూర్తియాదవ్ హైకోర్టులో కేసు వేసిన సంగతి తెలిసిందే. హైకోర్టు నిర్మాణాలు ఆపాలని సూచించినా పనులు కొనసాగించడంతో వాటిని తొలగించాలని జీవీఎంసీని కోర్టు ఆదేశించింది. దీంతో ఇక్కడి అధికారులు తీరంవైపు పునాదులు తొలగించి, మిగిలిన నిర్మాణాలు వదిలేశారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో మూర్తి యాదవ్ దీనిని హైకోర్టుకు తెలియజేశారు. బుధవారం కేసు విచారణ సందర్భంగా జీవీఎంసీ అధికారులు మరో నోటీసు ఇచ్చినట్టు కోర్టుకు తెలిపారు. ఆ భూమిపై హక్కు పత్రాలు, వాటికి సంబంధించిన తాజా ఎంకంబరెన్స్ సర్టిఫికెట్, ఆ స్థలాల్లో ఉన్న పాత నిర్మాణాలకు తీసుకున్న అనుమతి పత్రాలు మూడు రోజుల్లో సమర్పించాలని నిర్మాణ సంస్థ అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్‌పీని కోరినట్టు జీవీఎంసీ అధికారులు కోర్టుకు వివరించారు. ఆ గడువులోగా వివరాలు ఇవ్వకపోతే మిగిలిన నిర్మాణాలు కూడా తొలగిస్తారా? లేదా? అనేది వేచి చూడాల్సి ఉంది.

వంతెన మార్గం ఇలా.. నడిచి వెళ్లేది ఎలా?



సిమెంటు పలకల్లో తుప్పు పట్టిన ఇనుప ఊచలు

ఎన్.ఎ.డి. జంక్షన్, సెప్టెంబరు 11: ఎన్.ఎ.డి నుంచి కాకానినగర్‌కు వెళ్లే మధ్యలో రైల్వే ట్రాక్ బ్రిడ్జిపై ఏర్పాటుచేసిన పాదచారుల మార్గం శిథిలావస్థకు చేరుకుంది. పాదచారులు నడిచేందుకు వీలుగా నిర్మించిన ఈ వంతెన చివరనున్న పలకలు, గోడ దెబ్బతిన్నాయి. పలకలు కొన్నిచోట్ల పూర్తిగా పగిలి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. అలాగే, రక్షణ గోడ చాలాచోట్ల పగుళ్లుదేరాయి. ఈ మార్గ మధ్యలో కొత్తగా వంతెనకోసం పిల్లర్లు వేస్తున్నారు. వాటికి సంబంధించి పిల్లర్ బీమ్ రోడ్‌పైకి వచ్చేస్తోంది. దీంతో పాదచారులు నడిచే సమయంలో వాహనాలు తమపైకి వస్తాయేమోనని ఆందోళన చెందుతున్నారు. దీంతో కేవలం ఉదయం వేళలోనే రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి వేళలో వాహనాలు ఫుట్‌పాత్ పైకి వచ్చేప్రమాదంతో అటుగా వెళ్లడంలేదు. అ లాగే, కాకానినగర్ నుంచి ఎన్.ఎ.డి వైపు వచ్చే మార్గంలో కూడా ఫుట్‌పాత్ రక్షణ గోడ కూడా శిథిలమైంది.



ప్రత్యేక అలంకరణలో రాధారాణి

ఘనంగా రాధాష్టమి వేడుకలు

సాగర్‌నగర్, సెప్టెంబరు 11 : స్థానిక ఇస్కాన్ మందిరంలో రాధాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. వేకువజామున 4.30 గంటల నుంచి మందిరంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. హరినామ సంకీర్తనలు, పంచామృతాభిషేకాలు జరిపారు. ఈ సందర్భంగా ఇస్కాన్ విశాఖపట్నం అధ్యక్షుడు సాంబదాసు, మాతాజీ నితాయి సేవనులు రాధాకృష్ణలీలలపై ప్రత్యేక ప్రవచనాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను తన్మయానికి గురిచేశాయి.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, సెప్టెంబరు 11 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం ఆగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, సెప్టెంబరు 11 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరానికి చెందిన వై. పరదేశి, వెంకటలక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,00,116 లను చెక్కు రూపంలో ఆలయ పర్యవేక్షణాధికారి నరసింగరావుకు బుధవారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

కాంట్రాక్ట్ నర్సుల సమస్యలు పరిష్కరించాలి : బీవీ రామ్

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 11 : కాంట్రాక్ట్ నర్సులకు తగిన ప్రాధాన్యమివ్వాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ అన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిరసన వ్యక్తం చేస్తున్న నర్సుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వం వారి పట్ల దుర్మార్గంగా వ్యవహరించిందని, కూటమి పాలనలోనైనా వారికి న్యాయం చేయాలన్నారు.

సినిమా గైడ్

- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్:** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీకన్య, కిన్నెర, శారద, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీకాంత్ (గాజువాక).
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1,2 (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), హెవెన్-3 (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు :** శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **తంగలాన్ :** నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 49,టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 55, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 30, బీరకాయలు 42, ఆనపకాయలు 35, కాలీఫ్లవర్ 34, క్యాబేజీ, 26, క్యారెట్ 36, దొండకాయలు 44, బంగాళదుంపలు 29, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 70, బీట్‌రూట్ 35, బరబటి 42, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 105, గోరుచిక్కుడు 34, దోసకాయ 36, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 105, పొటల్స్ 50, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 54, కంద 54, దేముడు చిక్కుడు 75, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	95
ఫారం ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



తుప్పలతో నిండిపోయిన ఈశాన్య ఒడ్డున ఉన్న రాతి మండపం



శిథిలావస్థలో ఉన్న పుష్కరిణిలోని ప్రధాన మండపం

నిర్వహణ లోపంతో పురాతన కట్టడాలు

- పుష్కరిణి రాతి మండపాలపై ఏపుగా పెరిగిన మొక్కలు
- శిథిలావస్థలో నిర్మాణాలు

సింహాచలం, సెప్టెంబరు 11 : సింహగిరిపై ఉన్న పురాతన కట్టడాలను పరిరక్షించాలని భక్తులు కోరుతున్నారు. వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండ దిగువ పుష్కరిణిలో రెండు అలనాటి రాతి మండపాలు ఉన్నాయి. అడివివరం గ్రామస్తులు కొన్ని దశాబ్దాల కింద మృతదేహాల ఖననం కోసం దేవస్థానం సహకారంతో పది ఎకరాల్లో పుష్కరిణిని తవ్వించారు. దానికి ఆనుకుని మరో రెండు ఎకరాల్లో శశ్మాన వాటిక ఏర్పాటు చేశారు. పుష్కరిణి ఏర్పాటైన కొన్నేళ్ల తరువాత సింహాద్రినాథుడి తెప్పోత్సవాన్ని అక్కడ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఐదేళ్ల క్రితం నుంచి కార్తీక పౌర్ణమి నాడు నదీ హారతి కూడా చేయడం ఆచారంగా మారింది. తెప్పోత్సవం కోసం పుష్కరిణి మధ్యన ఒకటి, గ్రామస్తుల అవసరాల నిమిత్తం ఈశాన్య ఒడ్డున మరో రాతి మండపాలను ఎంతో నైపుణ్యంతో నిర్మించారు.అయితే కొన్నేళ్లుగా నిర్వహణ లేకపోవడంతో మండపాలపై తుప్పలు ఏపుగా పెరిగాయి. దీంతో ఈశాన్య ఒడ్డున ఉన్న మండపం కూలిపోయే స్థితికి చేరింది. పుష్కరిణి మధ్యలో ఉన్న మండపంపై మొక్కలను తొలగించకపోతే దాని పరిస్థితి కూడా అలానే ఉంటుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

హోం మంత్రికి డీజే సౌండ్స్ అండ్ లైటింగ్స్ కార్మికుల వినతి



హోంమంత్రి అనితకు వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

సింహాచలం, సెప్టెంబరు 11 : వివాహాది శుభ కార్యాలతో పాటు గణపతి, దేవీ నవరాత్రుల్లో డిజే సౌండ్ అండ్ లైటింగ్స్ ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఐదు వేల మంది కార్మికులు జీవన భృతి పొందుతున్నారని, ఈఏడాది పోలీసులు విధించిన షరతుల వల్ల వారంతా రోడ్డున పడాల్సిన పరిస్థితి దాపురించిందని శ్రీలక్ష్మీ నరసింహ మైక్ అండ్ లైటింగ్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. గురువారం వారు గోపాలపట్నంలో ఎమ్మెల్యే గణబాబు నివాసంలో రాష్ట్ర హోం మంత్రి అనితను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీ డీజే సౌండ్స్ అండ్ సిస్టమ్‌ను మండపాల వద్ద, నిమజ్జనంలో నిషేధిస్తూ ఆదేశాలు ఇవ్వడం వల్ల కార్మికుల జీవన భృతికి ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకుంటామని, అనుమతులు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువు గట్టుపై 250 కొబ్బరి మొక్కల పెంపకం

పద్మనాభం, సెప్టెంబరు 11 : మండలంలోని బీఆర్ తాళ్లవలసలో పెద్ద చెరువు గట్టుపై ఉపాధి హామీ పథకం కింద 250 కొబ్బరి మొక్కలు నాటారు. ఈ పథకం కింద చెరువులో పూడిక తీసి గట్టును పటిష్టం చేశారు. ఈమేరకు గట్టు చుట్టూ సుమారు 250 కొబ్బరి మొక్కలు నాటారు. వీటిని రెండేళ్లపాటు సంరక్షించే పనిని కూడా ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడతామని ఏపీఓ వరలక్ష్మి చెప్పారు. ఇందుకు రూ.2.55 లక్షలు ఉపాధి నిధులు వెచ్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రమణ, క్షేత్ర సహాయకుడు శ్రీను, టీడీపీ నాయకుడు పైల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

'సనాతన ధర్మానికి పుట్టినిల్లు భారత్'



మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

ఆరిలోవ, సెప్టెంబరు 11 : సంస్కృతికి, సనాతన ధర్మానికి పుట్టినిల్లు భారత దేశమని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం ఆయన విశాఖ వ్యాలీ స్కూలులో హెరిటేజ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాడ్జీ సెర్మనీ కార్యక్రమంలో మాట్లాడారు. దేశ సంస్కృతీ సంప్రదాయాలను ముందు తరాలకు తీసువెళ్లడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. చికాగో నగరంలో స్వామి వివేకానంద అమెరికా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన రోజునే హెరిటేజ్ క్లబ్ సెర్మనీ నిర్వహించడం గొప్పవిషయమన్నారు.అనంతరం పాఠశాల ఆవరణలో ఆయన మొక్క నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరీ ప్రభాకర్, ఇంటాక్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పీఎం పాలెం విజేత సూపర్ మార్కెట్ నుంచి సాంకేతిక కళాశాలకు వెళ్లే రోడ్డులో ఏర్పడిన గొయ్యి

అధ్వాన రోడ్లతో అవస్థలు

కొమ్మాది, సెప్టెంబరు 11 : జీవీఎంసీ ఆరో వార్డు పీఎం పాలెం కాలనీ, సౌండ్ అండ్ సౌండ్ లేఅవుట్, బక్కన్నపాలెం నుంచి రేవళ్లపాలెం వెళ్లే రోడ్లు గోతులతో అధ్వానంగా ఉన్నాయి. గత ప్రభుత్వం రోడ్ల దుస్థితిని పట్టించుకోకపోవడంతో కనీసం మరమ్మతుకు కూడా నోచుకోలేదు. దీంతో రోడ్లన్నీ గోతులమయంగా మారాయి. పీఎం పాలెం విజేత సూపర్ మార్కెట్ పక్క నుంచి సాంకేతిక కళాశాలకు వెళ్లే మార్గంలో గత ప్రభుత్వం ఎన్నికల దగ్గరలో ఆదరాబాదరాగా నిర్మించిన రహదారిపై పలుచోట్ల పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. బక్కన్నపాలెం నుంచి రేవళ్లపాలెం వెళ్లే రహదారిలో ఎస్సీ కాలనీ వద్ద పెద్ద గొయ్యి ఏర్పడడంతో వాహనదారులు రాత్రి వేళ ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే పీఎం పాలెం బాబా కళాశాలకు వెళ్లే రోడ్డు కూడా గోతులు పడి అధ్వానంగా ఉంది. అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సూర్యకాంతానికి ఆశించిన స్థాయిలో దక్కని గుర్తింపు

- ఆమె శత జయంతి వేడుకల్లో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్
- తెలుగు సినీ రంగంలో సూర్యకాంతానిది ప్రత్యేక ముద్ర : నటుడు తనికెళ్ల భరణి



కార్యక్రమంలో పాల్గొన్న సుప్రీంకోర్టు విశ్రాంత జడ్జి చలమేశ్వర్, నటుడు తనికెళ్ల భరణి, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, తదితరులు

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ పరిశ్రమలో సూర్యకాంతానికి ఆశించిన స్థాయిలో పేరు దక్కలేదని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ పేర్కొన్నారు. వైజాగ్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ప్రముఖ నటి సూర్యకాంతం శత జయంతి వేడుకలను ఏయూలోని హిందీ భవన్‌లో బుధవారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తెలుగు సినిమా పరిశ్రమలో ప్రతిభావంతులైన నటులకు సరైన కీర్తి, ప్రతిష్టలు దక్కలేదన్నారు. బాపుకు ఎప్పుడో రావాల్సిన పద్మశ్రీ అవార్డును చివరిలో ఇచ్చారన్నారు.అలాగే సూర్యకాంతానికి కూడా మంచి గుర్తింపు దక్కలేదన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇంగ్లీష్ సినిమాల్లో నెగెటివ్ రోల్స్‌కు ప్రాధాన్యం ఉంటుందని, కానీ, భారతీయ సినిమాల్లో ఆశించిన స్థాయిలో గుర్తింపు రావడం లేదన్నారు. ప్రముఖ నటుడు, రచయిత డాక్టర్ తనికెళ్ల భరణి మాట్లాడుతూ ప్రపంచ చలన చిత్ర చరిత్రలో ఒకే పాత్రలో 325కు పైగా చిత్రాల్లో నటించిన ఏకైక నటి సూర్యకాంతమని పేర్కొన్నారు.గెటప్, పాత్ర స్వభావం మారకుండా ఈ స్థాయిలో సినిమాలు చేయడం ఆమెకు మాత్రమే సాధ్యమైందన్నారు. ఏ పాత్రనైనా ఎడమ చేత్తో చేసే సత్తా ఆమె సొంతమన్నారు. తెలుగు జాతి ఉన్నంత కాలం సూర్యకాంతం ఉంటారని ఆయన కొనియాడారు. నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ సూర్యకాంతం గొప్ప నటి అని, 50 ఏళ్ల కిందట ఆమెతో తమ కుటుంబం కారులో ప్రయాణించిందన్నారు. సూర్యకాంతం కుమారుడు డాక్టర్ అనంత పద్మనాభమూర్తి మాట్లాడుతూ శత జయంతి ఉత్సవాలను నిర్వహించడం ఆనందంగా ఉందని, ఆమె బిడ్డగా పుట్టినందుకు తమ జన్మ సార్థకమైందన్నారు.

సభకు పద్మవిభూషణ్ ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అధ్యక్షత వహించగా, వైజాగ్ ఫిలిం సొసైటీ ప్రధాన కార్యదర్శి నరవ ప్రకాశరావు కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఉప్పుటేరు వద్ద కనుమరుగైన ఇసుక దిబ్బలు

వరదలకు ఇసుక దిబ్బలు మాయం

భీమునిపట్నం, సెప్టెంబరు 10 : భారీ వర్షాలతో గోస్తనీ నదిలో నీటి ప్రవాహం పెరిగింది.దీంతో భీమిలిలోని ఉప్పుటేరు నిండుకుండలా తయారైంది. తాటిపూడి జలాశయం గేట్లు కూడా ఎత్తి వేయడంతో నది పరవళ్లు తొక్కుతూ సముద్రంలో కలుస్తుంది. వరద ధాటికి ఉప్పుటేరుకు, సముద్రానికి మధ్య ఉన్న ఇసుక దిబ్బలన్నీ మాయమయ్యాయి. గతంలో భీమిలి నుంచి చిననాగమయ్యపాలెం, పెదనాగమయ్యపాలెం, అన్నవరం వరకూ ఇసుక దిబ్బలు ఉండేవి. ఇవన్నీ వరదలకు కనుమరుగయ్యాయి.కాగా తాటిపూడి డ్యామ్ గేట్లు ఎత్తివేయడంతో అక్కడి నుంచి వస్తున్న నీటి ప్రవాహంలో చెరువులోని చేపలు కొట్టుకు వస్తున్నాయి.దీంతో స్థానిక మత్స్యకారులు సాగర సంగమ ప్రదేశంలో విసిరొలలతో చేపలు పడుతున్నారు. మోస రకం చేపలు ఎక్కువగా పడుతున్నాయి. ఒక్కో చేపను రూ. 400 లకు విక్రయిస్తున్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనాలు

మధురవాడ, సెప్టెంబరు 11 : చంద్రంపాలెంలో ఏర్పాటు చేసిన 33 అడుగుల భారీ మట్టి గణపతి ప్రతిమ భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఇక్కడ జరుగుతున్న పూజలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు.కాగా టైలర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన బాల గణపతిని బుధవారం రుషికొండ బీచ్‌లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా లడ్డూ వేలం వేయగా అశోక్‌కుమార్ పాట దక్కించుకున్నారు.

సిరిపురం : సిరిపురం, వీఐపీ రోడ్డు, స్వర్ణ భారతి స్టేడియం తదితర ప్రాంతాల్లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఆయా ప్రాంతాల్లో అన్నసమారాధన నిర్వహించారు. స్వర్ణభారతి స్టేడియం రోడ్డులో రెబల్ బాయ్స్ ఆధ్వర్యంలో గణపతికి ప్రత్యేక అలంకరణలో భాగంగా నోట్ల దండ వేశారు.

వెంకోజీపాలెం : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులు ఏర్పాటు చేసిన వినాయకమండపం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులంతా కలిసి అన్నసమారాధన ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.సాయంత్రం గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఎంవిడి. ఫణి రాం, జీవీఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : పట్టణంలోని గోస్తనీ సాగరతీరంలో గణనాథుని నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. నగర జాయింట్ సీపీ పకీరప్ప, డీసీపీ అజిత్ వేజెండ్ల, ఏసీపీ పెంటారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



జీవీఎంసీ ఉద్యోగులు ఏర్పాటు చేసిన అన్న వితరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏడీసీ రమణమూర్తి



చంద్రంపాలెంలో ఏర్పాటు చేసిన 33 అడుగుల గణపతి ప్రతిమ



రెబల్ బాయ్స్ ఆధ్వర్యంలో నోట్ల దండతో వినాయకుడు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమిలిలో 14 నుంచి రాష్ట్రస్థాయి యోగా పోటీలు

భీమునిపట్నం, సెప్టెంబరు 11 : యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో విశాఖ యోగా స్పోర్ట్సు అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ యోగా స్పోర్ట్సు అసోసియేషన్ సంయుక్తంగా ఈనెల 14, 15 తేదీల్లో భీమిలిలో నిర్వహించే రాష్ట్రస్థాయి యోగా పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భీమిలిలోని ది సన్ స్కూల్ ఆవరణలో రెండు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. ప్రతిఒక్కరి జీవితంలో యోగా ఒక భాగం కావాలన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ వయస్సుల వారీగా సబ్ జూనియర్స్, జూనియర్స్, వెటరన్ గ్రూపులుగా పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా జరుగుతాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల నుంచి సుమారు 500 మందికి పైగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, యోగా అసోసియేషన్ ప్రతినిధులు రామారావు, శ్రీనివాసరావు, చక్రవర్తి, వెంకటేష్ పాల్గొన్నారు.

వరద బాధితులకు వాకర్స్ రూ.1.44 లక్షల విరాళం



ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు విరాళం అందిస్తున్న శివాజీ పార్కు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 11 : విజయవాడలోని వరద బాధితులకు శివాజీ పార్కు గొడుగు వాకర్స్ అసోసియేషన్ 1,44,116 లక్షల రూపాయల విరాళం ప్రకటించింది. ఈమొత్తాన్ని అసోసియేషన్ సభ్యులు చెక్కు రూపంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. దీన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శివరామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్ ప్రసాద్, కార్యదర్శి సత్యనారాయణ, ఎన్. రామకృష్ణ, శుభ, ద్వారకానాథ్, నందూరి రామకృష్ణ, ఎం. వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల విరాళం

కొమ్మాది : కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం మానవతా ధర్మమని ఆరో వార్డు టీడీపీ అధ్యక్షుడు, విశాఖ పార్లమెంట్ అధికార ప్రతినిధి దాసరి శ్రీనివాస్ అన్నారు. వరద బాధితుల సహాయార్థం ఆరో వార్డుకు చెందిన డ్వాక్రా మహిళలు ఆర్‌పీల ద్వారా రూ.45 వేల చెక్కును బుధవారం ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సత్యనారాయణ, సంతోష్‌నాయుడు, పాపారావు పాల్గొన్నారు.

ప్రజల్లో ఐక్యత అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 11 : యువత ప్రజల్లో ఐక్యతాభావాన్ని పెంపొందించి, వసుదైక కుటుంబ నిర్మాణానికి కృషి చేయాలని ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ. నరసింహారావు అన్నారు. ఏయూ జాతీయ సేవా పథకం సెమినార్ హాల్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం పూర్వ గణతంత్ర దినోత్సవం పెరేడ్ ఎంపిక శిబిరం ప్రారంభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ స్థాయి కార్యక్రమాల్లో పాల్గొని ఏయూ ఖ్యాతిని పెంచాలన్నారు. ఎన్ఎస్ఎస్ పథకం ప్రాంతీయ సంచాలకుడు ఎం.రామకృష్ణ మాట్లాడుతూ వర్సిటీ స్థాయిలో జరిగే ఎంపిక ప్రక్రియలో ఎంపికైన వారు వచ్చే నెల పూణేలో జరిగే పూర్వ గణతంత్ర శిబిరంలో పాల్గొంటారని, అక్కడ ఎంపికైన వారు న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవం పెరేడ్‌లో పాల్గొంటారని చెప్పారు.

నీట మునిగిన వరి పంట పరిశీలన



బాంధేవుపురంలో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పద్మనాభం (రూరల్), సెప్టెంబరు 11 : మండలంలోని బాందేవుపురం, వీకే పాలెం, పద్మనాభం, బోని, అనంతవరం గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు పలు సూచనలు చేశారు. పొలాల్లోని నీటిని వెంటనే బయటకు తీసి వేయాలన్నారు. అనంతరం ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరెట్ పొటాష్ వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె. అప్పలస్వామి, అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం కీటక శాస్త్ర విభాగం శాస్త్రవేత్తలు ఎం. విశాలక్ష్మి, శిరీష, భీమిలి సబ్ డివిజన్ సహాయ సంచాలకుడు సుబ్రహ్మణ్యం, ఏఈవో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో డెబ్రిస్

ఆరిలోవ, సెప్టెంబరు 11 : ముడసర్లోవ చెరువుకు నీరు చేరే కాలువలు, తూముల వద్ద భారీగా డెబ్రిస్ పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో కొండపై నుంచి వస్తున్న వర్షం నీరు కాలువలు, తూముల నుంచి పక్కకు వెళ్లిపోతుంది. కొండ నుంచి వచ్చే నీరు చెరువులో చేరడానికి అను కూలంగా జీవీఎంసీ అధికారులు లక్షలాది రూపా యలు వెచ్చించి పెద్ద పెద్ద కందకాలు తవ్విం చారు. దీంతో వర్షం నీరు నేరుగా చెరువుకు చేరేది. బీఆర్‌టీఎస్ సర్వీసు రోడ్డును ఆనుకొని ఉన్న కొండవాలు ప్రాంతంలో కూడా కందకం తవ్వారు. అయితే కొందరు స్థానికులు రాత్రి వేళ భవన నిర్మాణ సామగ్రి తీసుకువచ్చి (డెబ్రిస్) తూముల వద్ద, కాలువల్లోనూ వేస్తున్నారు. దీనివల్ల కొండ నుంచి వస్తున్న వర్షం నీరు ఎక్క డికక్కడే నిలిచిపోతోంది. అధికారులు తక్షణమే స్పందించి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగెలు



ఆరిలోవ, సెప్టెంబరు 11 : శ్రీకాంత్‌నగర్ కాలనీలోని రోడ్డు నంబర్ 8లో ఉన్న విద్యుత్ స్తంభానికి చెట్ల కొమ్మలు, తీగెలు అల్లుకుపోయాయి. దీంతో సరఫరాలో తరచూ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అలాగే కొమ్మలు వల్ల కొన్నిసార్లు స్తంభం షాక్ కొట్టడంతో పాటు గాలులకు వైర్ల నుంచి మంటలు రేగుతున్నాయి. అంతేకాదు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఇళ్లల్లోని ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోతున్నాయి. ఈవిషయమై విద్యుత్ శాఖాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.